ప్రజాశక్తి

Vol. 6, no. 21

(May. 23, 1945)

బెజవాడ, 1945

Record no. 683


Prajāśakti

Vol. 6, no. 21


(May. 23, 1945)

Bejavāḍa, 1945

Record no. 683




రాజమండ్రిలో "మేడే" ఊరేగింపు



రాజమండ్రిలో 8 వేలమంది పాల్గొన్న "మేడే" సభ

ప్రజాశక్తి


సంపుటి 6 | బుధవారం 23-౫-45 | సంచిక 21



కృష్ణాజిల్లా మహిళామహాసభ ప్రతినిధుల సమావేశం

హజ్రా బీగం
(కృష్ణాజిల్లా మహిళామహాసభ ప్రారంభకులు)





కృష్ణాజిల్లా మహిళాకాన్ఫరెన్సులో ఊరేగింపు



అఖిలభారత రైతుమహాసభ (నేత్రకోన) లో ప్రేక్షకుల దృశ్యం

"ప్రజాశక్తి"కి కనకవర్షం

★

గన్నవరం తాలూకా రు 30 వేలు వాగ్దానం

కామ్రేడ్ సుందరయ్య "ప్రజాశక్తి"ని దినపత్రికగా చేయడానికి 5 లక్షల రూపాయలు కావాలని, ఆంధ్రప్రజలు విరివిగా విరాళాలు యిచ్చి తోడ్పడవలసిందని, విజ్ఞప్తి చేశారు. ఆపిలుపు అందుకోగానే పార్టీసభ్యులలో సంతోషసంకోచాలు కలిగాయి "ప్రజాశక్తి" దినపత్రిక అవుతున్నందుకు సంతోషం; 5 లక్షలు వసూలు చేయగలమా అనే సంకోచం. "ప్రజాశక్తి" వారపత్రికగా స్వాతంత్ర్యోద్యమానికి చేస్తున్న సేవ ఆంధ్రప్రజలు నిత్యమూ చూస్తున్నారు. అది యెప్పుడు దినపత్రిక అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. వివిధ ప్రజా ఉద్యమాలకు సాయంచేస్తూ వీటిని అభివృద్ధి మార్గాన గొంపోవుటకు శతవిధాల కృషి చేస్తున్న "ప్రజాశక్తి" దినపత్రిక అయినచో స్వాతంత్ర్యోద్యమం ఎన్నోరెట్లు బలపడుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఆంధ్రదేశంలో ఒక నూతన జీవితాన్ని సృష్టిస్తున్న "ప్రజాశక్తి" దినపత్రిక కావాలని ప్రతివాడు ఉవ్విళ్లూరు తున్నారు.

'ధనమూల మిదంజగత్'

ఇట్టి సమయంలో వచ్చిన సుందరయ్య పిలుపు ఎంతో ఉత్సాహాన్ని కలుగజేసింది. ప్రజలు ఏక కంఠంతో కోరుతున్న వాంఛ నేడు సాఫల్యమగుచున్నది గదాయని అందరూ ఉత్సాహపడ్డారు. 'ధనమూల మిదం జగత్' అన్నట్లు యెంత ఉత్సాహమున్నా, డబ్బులేనిదే యేదీ కార్యరూపం దాల్చదు. అందుచే కృష్ణాజిల్లా కమిటీ వెంటనే సమావేశం అయింది. అన్ని ఉద్యమాలకు తలమానికమైన కృష్ణాజిల్లాలో ఏమైనాసరే 2½ లక్షల రూపాయలు వసూలు చేయాలని నిశ్చయించింది. పై 2½లక్షల రూపాయలలో 60 వేల రూపాయలు గన్నవరం తాలూకాలో వసూలు చేయాలని నిశ్చయించబడింది.

గన్నవరం తాలూకా కమిటీ వెంటనే తాలూకాపార్టీ సర్వసభ్య సమావేశం జరుపనిశ్చయించుకొంది. వివిధ గ్రామాలలోని పార్టీ సభ్యులందరు కాటూరులో సమావేశం కావాలని తెలియపరచింది. గడువు చాలా తక్కువవున్నా, 50 గ్రామాలనుండి 200 మంది పార్టీ సభ్యులు, సానుభూతిపరులు 14-5-45 న హాజరయ్యారు. జిల్లాకమిటీసభ్యులుకామ్రేడ్ మానికొండ సుబ్బారావు అధ్యక్షత వహించారు. రాష్ట్రకమిటీ సభ్యులయిన కామ్రేడ్ కడియాల గోపాలరావు అంతర్జాతీయంగా ఫాసిస్టుశక్తులు నాశనమై, వివిధ దేశాల్లో ప్రజాఉద్యమాలు ఎలా బలపడుతుందీ, సామ్రాజ్యవాదులు పన్నుచున్న వలల్లో పడకుండా తప్పించుకొని ఎలాఎదురు దెబ్బలు కొట్టుచున్నదీ వివరించారు. జాతీయంగా మనల నెదుర్కొంటున్న ప్రధాన సమస్యల్నీ, వాటి పరిష్కార మార్గాన్ని వివరించారు. తరువాత ఆంధ్రరాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు అనేకరెట్లు అభివృద్ధి చెందిన నేటి పరిస్థితుల్లో వాటికి దినపత్రికలలో సరియైన స్థానం యివ్వబడుటలేదనీ, పైపెచ్చు ఆ ఉద్యమాలను విచ్ఛిన్నం చేయడానికే నిర్మాణ కార్యక్రమం పేరుతో సాగుతున్న విచ్ఛిన్న చర్యలకు ప్రాధాన్యత యివ్వబడుతోందనీ చెప్పారు. ప్రజాఉద్యమాలు ఉన్నత స్థాయికి వెళ్లాలంటే దినపత్రిక యెంతో అవసరమన్నారు. దానికొరకు పార్టీ సభ్యులు, ప్రజలు త్యాగం చెయ్యాలని వుంటుందనీ చెప్పారు.

గోపాలరావుగారి ఉపన్యాసం సభ్యులను ఉద్రూతలూగించింది. ఎంత త్యాగానికైనా సంసిద్ధులమే నన్నట్లు వారి ముఖాల్లో గోచరించింది. ఉపన్యాసం కాగానే ఎవరెవరు యెంత విరాళం యిచ్చేది వాగ్దానం చెయ్యమన్నారు.

కనీవిని ఎరుగని త్యాగపటిమ

ఒకరివెంట ఒకరులేచి తమవంతు విరాళం చెప్పసాగారు. ప్రతిఒక్కరూ కనీవిని ఎరుగని త్యాగపటిమను ప్రదర్శించారు. ఇటువంటి త్యాగశీలురు చేయలేనిది ఏదీలేదనిపించింది. ప్రజలలో నిత్యం పనిచేస్తూ ప్రజలకు త్యాగం చేయాల్సిన ఆవసరాన్ని బోధిస్తున్న ప్రజాసేవకులు తాము ముందు ఆదర్శంగా వుంటామని చూపసాగేరు. ఒక గంటలో 100 మంది లేచి తమ వాగ్దానాలను వరసవరసగా చెప్పసాగారు. లిస్టు వ్రాసుకుంటున్న తాలూకాకమిటీ కార్యదర్శి పని కష్టమయింది. అరగంటలో 20 వేల రూపాయల వాగ్దానాలు వచ్చాయి.

కామ్రేడ్ సత్యప్రసాద్ ముందు ప్రారంభించాడు. ఈయన మధ్యతరగతిరైతు. గత సంవత్సరం 2 వేలు పార్టీఫండు యిచ్చాడు. "ప్రజాశక్తి" ఫండుకు రు. 500 యిస్తానని వాగ్దానం గావించాడు. కామ్రేడ్ వెనిగళ్ళ కృష్ణమూర్తి గత సంవత్సరమే 2 వేలు పార్టీ ఫండు యిచ్చాడు. "ప్రజాశక్తి" పిలుపు అందుకోగానే మరొక 1000 రూపాయలు వాగ్దానం చేశాడు. కామ్రేడ్ శనగల విశ్వనాథం ప్రతి సంవత్సరం విరివిగా పార్టీ ఫండు యిస్తూ పార్టీ సభ్యులకు ఆదర్శప్రాయంగా ఉంటున్నాడు. ఈ పిలుపు వినగానే రు. 1000 వాగ్దానం చేశాడు. ఈ విధంగా వేలు, అయిదు వందలు వందలనుండి ఆయిదు రూపాయలవరకు వాగ్దానాలు వచ్చాయి.

శక్తికి మించిన త్యాగం!

అన్నిటికంటె ముఖ్యంగాపేర్కొవలసింది కామ్రేడ్ చింతపల్లి పాపారావు విషయం. క్రిందటిసంవత్సరమే ఇతను 5 వేలరూపాయల వరకు పార్టీఫండు యిచ్చాడు. అయిదుఎకరాల రైతు. అందుచే యీ సంవత్సరం ఎక్కువ మొత్తం అడుగుట శక్తికిమించిన విషయమనే సంకోచముతో ఎంత విరాళం యిస్తావని కార్యదర్శి అడిగాడు. ఒక యకరం అమ్మి యిస్తానని వెంటనే సమాధానం! "అది నీశక్తికి మించిన త్యాగం. నీదగ్గర 500 కంటె యెక్కువ తీసుకోను"ని కార్యదర్శి చెప్పాడు. విరాళాలు ఒకరొకరే అందరూ చదివిస్తున్నారు. పాపారావు అధ్యక్ష స్థానంవద్దకు వచ్చి నిలబడ్డాడు. సంకోచిస్తున్నాడు. ఏమైనా సరే, యకరం అమ్మియిస్తాను-టూ నెమ్మదిగా కామ్రేడ్ సుబ్బారావు చెవిలో చెపుతున్నాడు. కామ్రేడ్ కడియాల యీ విషయం అంతా పక్కనుండే గమనిస్తున్నాడు. వెంటనే లేచి పాపారావు త్యాగాన్ని ప్రశంసించి, 500 రూపాయలకంటె ఎక్కువ అంగీకరించమని చెప్పాడు. అందుకు పాపారావును నచ్చజెప్పి ఒప్పించాడు. ఈ దృశ్యం చూస్తున్నప్పుడు ఒళ్ళు గగుర్పొడిచింది. ఇటువంటి త్యాగశీలురు ప్రజాఉద్యమాలలో పని చేస్తుంటే, స్వాతంత్ర్య భానోదయం ఎంతో దూరంలో లేదనిపించింది.

రైతులకు వ్యవసాయ కూలీలు ఏమాత్రం తీసిపోలేదు పైవిషయాలన్నీ చూస్తూ కూర్చున్నారు వ్యవసాయకూలీ కామ్రేడ్స్. ఇక ఊరుకుంటే లాభంలేదనుకొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో తమపాత్రను నిర్వహించాలనే ఉత్సాహం వారిలో మిన్నుముట్టింది. "ప్రజాశక్తి" పత్రిక తమ వర్గశ్రేయస్సుకు చేస్తున్న కృషిని చూస్తున్నారు. దినపత్రిక అయితే, తమ ఉద్యమం అనేకరెట్లు బలపడుతుందని తెలుసు వారికి. రైతు కామ్రేడ్స్‌తో సమానంగా ఎక్కువ మొత్తాలిచ్చి పోటీచెయ్యలేకపోయినా, ఉత్సాహంలోనూ, త్యాగంలోనూ ఏమాత్రమూ తీసిపోలేదు. వెనువెంటనే ఒక్కరొక్కరులేచారు. నిత్యమూ కూలీ డబ్బులతో జీవిస్తున్న ఆ కూలీకామ్రేడ్స్ ఒక్కొక్కరు 10 రూపాయల నుండి 1 రూపాయ వరకు వాగ్దానాలు గావించారు. ఈ విధంగా 15 మంది వాగ్దానం చేశారు. ఇది చూస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు నలుగురు, తాము ఎవరికీ తగ్గమన్నట్లుగా రు. 15, రు. 10 చొప్పున వాగ్దానాలు చేశారు. అన్నివర్గాల ప్రజలకు ఆదర్శప్రాయ మయ్యారు కార్మికులు, వ్యవసాయకూలీలు.

మొత్తం 100 మంది యిలా వాగ్దానాలు చేశారు. 20 వేల రూపాయలయింది. ఈ సంవత్సరమే జనవరి తరువాత తాలూకాలో 8 వేల రూపాయలు పార్టీఫండు వసూలు చేయబడింది. మళ్ళీ యిప్పుడు వసూలు చేయవలసివచ్చినా, కామ్రేడ్స్ వెనుకంజ వేయలేదు.

కాటూరు గ్రామంలో పదివేలు

ఈ వందమంది కామ్రేడ్సులో ఒక్కరూ కాటూరువారు లేరు. ఈ గ్రామం పార్టీఫండు పిలుపు వినగానే, ఈ సంవత్సరం 3 వేల రూపాయలు యిచ్చి మార్గదర్శకమయింది. జిల్లా మహిళాకాన్ఫరెన్సుకు రు. 1500 వరకు విరాళాలిచ్చి విజయవంతంగా జరిపింది. మహిళామహాసభకు వచ్చిన స్త్రీలను సత్కరించుటలో 1000 రూపాయలవరకు ఖర్చుచేశారు. అందుచే యీసారి కాటూరుగ్రామం వదలి వేయబడిందేమోనని యితర కామ్రేడ్స్ అనుకుంటున్నారు. కాని, కామ్రేడ్ గోపాలరావు లేచి, "ప్రజాశక్తి" ఫండుకు కాటూరుగ్రామం 10 వేల రూపాయలు యివ్వ నిశ్చయించిందని ప్రకటించారు. ఇకసంతోషానికి మేరలేకపోయింది. అంతా మధ్యతరగతికి చెందిన బీదరైతులయినా, త్యాగంలో అసమాన మనిపించారు కాటూరు వారు. సభ్యులందరిలో ఆత్మవిశ్వాసం పెంపొందింది.

మొత్తం 30 వేల రూపాయలు వాగ్దానాలు వచ్చాయి. తాలూకాలో మరొక 30 వేల రూపాయలు వసూలుచేయాలి. ఫిర్కాలనుండి వచ్చిన కామ్రేడ్సు, ప్రజలు తమకు తప్పక తోడ్పడతారనే దృఢ విశ్వాసంతో కోటాలు తీసుకున్నారు. పై వాగ్దానాలను కలుపుకొని కపిలేశ్వరపురం ఫిర్కా 10 వేలు, వుయ్యూరు ఫిర్కా 25 వేలు, వీరవల్లి 15 వేలు, గన్నవరం ఫిర్కా 10 వేలు- మొత్తం 60 వేలు వసూలు చేస్తామని ఆయా కామ్రేడ్స్ తమ సంకల్పాన్ని తెలియజేశారు.

మొదట కలిగినసంకోచం మటుమాయమైంది. వచ్చిన కామ్రేడ్సుఅంతా ప్రజాసామాన్యంలో ఇంకా యెక్కువ పనిచేసి, వారిత్యాగ ప్రమాణాన్ని హెచ్చుచేయాలని, "ప్రజాశక్తి" ఫండును రెండునెలల్లో పూర్తిగా వసూలు చేసి పంపాలనే పట్టుదలతో తిరిగివెళ్ళారు.

— మా విలేఖరి

భూరివిరాళం

★

కామ్రేడ్ సుందరయ్యగారికి—

ది 2-5-45 "ప్రజాశక్తి" సంచికలో మీరువ్రాసిన "ప్రజాశక్తి దినపత్రికకు 5 లక్షలు విరాళాలు యివ్వండి" అనే వ్యాసాన్ని చదివినాను. యిప్పుడు తెలుగు పత్రికలు ప్రజాసమస్యలను తీసుకొని పనిచేయుట మరచిపోయి పార్టీ విభేదాలను యెక్కువజేసి, ప్రజలకు ఒక దారి తెన్ను కానరాకుండా జేస్తున్నాయి. ప్రజాశక్తి పత్రిక ప్రజాసమస్యలను తీసుకొని, వాటికి పరిష్కార మార్గాన్ని చూపిస్తూ ప్రజలకు ఎంతో సేవజేస్తోంది. అటువంటి ప్రజాశక్తి నేడు దినపత్రికగా రాబోతున్నదంటే, సంతోషించనివారెవరూ వుండరు. మా నైజాం ప్రజలకుకూడా ఎంతో సహాయపడుతోంది. యీ విధంగా ప్రజలకొరకు పనిజేసే పత్రిక దినపత్రిక కాబోతున్నదంటే, 5 లక్షలు విరాళాలలో తమవంతు చెల్లించకుండా తప్పించుకునే ఆంధ్రులెవరూ వుండరు. నారాయణరెడ్డిగారి నాయకత్వంక్రింద 80 లక్షలమంది ఆంధ్రులకు ప్రాతినిధ్యంవహించి పనిజేస్తున్న మా నైజాం ఆంధ్ర మహాసభ తరపున నేను నా వంతు రు. 4000/- లు (నాలుగువేల రూపాయిలు) యిస్తున్నాను.

పాటిబండ్ల రఘుపతిరావు
జానకీపురం.

దినపత్రికకు ముస్లిం సోదరుని విరాళం

3—5—45 వ తేదీ రాత్రి తిరువూరు తాలూకా గౌరపాలెం (కృష్ణా)లో సయ్యద్ సాలార్‌గారి కుమారుని ఒడుగు సందర్భంలో, వారుజిల్లా ముస్లింలీగుకి రు. 5—0—0 "ప్రజాశక్తి" దినపత్రికకు రు. 5—0—0 విరాళంగా యిచ్చారు.

బానిసదేశాల పాలిటి కల్పతరువు సోవియట్

—— కంభంపాటి సత్యనారాయణ

"బానిసదేశాల ప్రజలకు ఎంత త్వరలో సాధ్యమైతే అంత త్వరలో సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చి తీరాలని రష్యా పట్టుపడుతోంది. ఈ విషయంలో రష్యా ఒంటరిగా పోరాడవలసి వచ్చేటట్లుంది. ఈ మహాసభలో (శాన్ ఫ్రాన్సిస్కో) రష్యాకు మెజారిటీ ఉండదనేమాట స్పష్టమే. అయినప్పటికీ, బానిసదేశాల పక్షంవహించి, నిజమైన ధర్మకర్తగా తన విధిని నిర్వహించడంలో రష్యాకు ఎంత చక్కని అవకాశం లభించింది!"

★

అంటూ "హిందూ" విలేఖరి బి. శివరావుగారు శాన్ ఫ్రాన్సిస్కోనుంచి రాస్తున్నారు.

ఇంతవరకు, ఏదేశమైనా మరోదేశంమీద యుద్ధం చేసి గెలిస్తే, ఆ దేశానికి కొన్ని భూభాగలమీద అధికారం లభించేది. కాని, యిప్పుడు అట్లాంటిక్ ఛార్టర్ ప్రకారం ఒక దేశం యితర దేశాల్ని ఆక్రమించకూడదు. దురాక్రమణ నిషేధించబడింది. అందువల్ల శాన్ ఫ్రాన్సిస్కోలో సమావేశమైన 49 మిత్రరాజ్యాల ప్రతినిధులు "ధర్మకర్తృత్వం" అనే సిద్ధాంతాన్ని అమలు జరపడమెలాగ? అని చర్చలు సాగిస్తున్నారు అనేక బానిసదేశాల్లో తరతరాలుగా సామ్రాజ్యవాద దోపిడీకి గురియై, స్వాతంత్ర్యంకోసం తహతహలాడే కోట్లాది పీడితప్రజలు యీ చర్చలవైపు దృష్టులు నిగిడ్చి చూస్తున్నారు.

ఇలాంటి పీడిత ప్రజల భవిష్యతును నిర్ణయించడంలో బ్రిటను యే దృక్పథం కలిగియుందోచూదాం. నానా రాజ్య సమితి 1918 లో ఏయే దేశాలకు ఏయే "మేండేట్లు"అప్పజెప్పిందో, అవన్నీ యికముందు కూడ ఆయా దేశాలకిందే వుండాలంటూంది బ్రిటను. ("మేండేటు" అంటే, ఒక "నాగరిక" ప్రభుత్వం వెనుకబడియున్న మరో "అనాగరిక" దేశాన్ని అభివృద్ధి చేయడంకోసం ధర్మకర్తగా ఉండడం. ఉదా: సౌత్‌వెస్టు ఆఫ్రికా, టెంగనియాకా, పాలెస్టయిన్, ట్రాన్స్‌జోర్డన్, మొదలైనవి బ్రిటిష్ "మేండేట్లు". లెబనాన్ సిరియాలు (ఫ్రెంచి "మేండేట్లు"). ప్రస్తుత యుద్ధంలో ఏదేశం గెల్చుకున్న "మేండేట్లు" ఆదేశానికే చెందాలి. ఇక, ఇండియావంటి పరాధీన దేశాలవిషయం: అవి స్వపరిపాలనకు అర్హత సంపాదించుకున్ననాడు, స్వపరిపాలనాధికారాన్ని ఇచ్చివేయాలి.(ఈ"స్వపరిపాలన" "సంపూర్ణస్వాతంత్ర్యం" కాదు. ఎవరికితోచిన నిర్వచనం వారు చేయవచ్చు.) ఈ "అర్హత" ఐనా ఎప్పుడు వస్తుందో నిర్ణయం చేసేది తాము ప్రజలు కాదు. ఇష్టమైతే, ఆయా ప్రభుత్వాలు యిలాంటి వలసదేశాలన్నింటినీ "ధర్మకర్తృ సంఘం" యొక్క పర్యవేక్షణకిందికి తీసుకురావచ్చు. ఇలాంటి ధర్మకర్తృత్వ రాజ్యాలు అప్పుడప్పుడు పైకి రిపోర్టులు పంపిస్తూ ఉండాలి. అయితే, పరాధీన దేశాలు స్వతంత్రంగా పరిపాలించుకునే స్థితికి వచ్చాయి కాబట్టి వాటికి స్వపరిపాలనాహక్కు యిచ్చివేయమనడానికి ఎవరికీ హక్కు ఉండదు.

దీని అర్థం, ఇప్పుడెవరికున్న సామ్రాజ్యాలు వారికే ఉండాలని బ్రిటన్ ఉబలాటపడుతోంది; ఇతరులు జోక్యం కలిగించుకోరాదని వాదిస్తోంది.

ఫ్రాన్సుకూడా బ్రిటన్ను బలపరుస్తోంది. ఇందుకు కారణం, బ్రిటన్ మాదిరిగానే ఫ్రాన్సుకు కొన్ని వలసదేశాల మీద అధికారం ఉంది.

ఇక అమెరికా విషయం. పసిఫిక్ సముద్రంలో ప్రస్తుతం అమెరికాకింద కొన్ని, జపానుకిందకొన్ని మిలిటరీకీలక ప్రదేశాలున్నాయి. (దీవులు, ద్వీపకల్పాలు) అవి అమెరికా భద్రతకు చాల అవసరమనీ, అందువల్ల అవి తన స్వాధీనంలో ఉండాలని అమెరికా వాదన. ఇతర రాజ్యాల జోక్యం పనికి రాదంటుంది. ఇవి తప్ప మిగతా ప్రాంతాల మీద"ధర్మకర్తృత్వ సంఘా"నికి పెత్తనం ఉండవచ్చునంటుంది.

అంటే, యిప్పుడు జపాను స్వాధీనంలో ఉన్న మంచూరియా - కొరియాలవంటి ద్వీపకల్పాలమీద, ఫార్మోజా- పసిఫిక్ దీవులవంటి దీవులమీద, అమెరికా అధికారం చెలాయించదలచుకొంటూంది.

ఈ విధంగా బ్రిటన్, అమెరికాలు సామ్రాజ్య తృష్ణతో, వెనుకబడియున్న వలసదేశాల స్వాతంత్ర్యాన్ని హరింపజూస్తూంటే, సోవియట్‌రష్యా ఎలాంటి వైఖరి నవలంబిస్తూందో పరిశీలిద్దాం. సోవియట్ ప్రతినిధులు ముఖ్యంగా నాలుగు ప్రతిపాదనలు చేశారు:

1. అన్ని వలస దేశాలకు (ఇండియా మొదలైనవి), "మేండేట్ల" పరిపాలనకిందవున్న ప్రాంతాలకు, సాధ్యమైనంత త్వరలో సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చివేయాలి. ఇది "ధర్మకర్తృత్వ సంఘం" యొక్క ప్రధానాశయమై ఉండాలి.

2. ఈ సంఘంలో సభ్యత్వం బ్రిటన్, అమెరికాలు సూచించినట్టు "మేండేటు" రాజ్యాలకే కాకుండా (బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా) పెద్దరాజ్యాలన్నింటికీ, అనగా రష్యా చైనాలకు కూడా, ప్రాతినిధ్యం ఉండాలి.

3. ఈ సంఘం ఇచ్చే ఉత్తరువులు అమలు జరుగుతున్నాయో, లేదో పరిశీలించడానికి అప్పుడప్పుడు తన ప్రతినిధుల్ని పంపుతూవుండాలి.

4. ఏయే ప్రాంతాలు కీలకస్థాలని యీ సంఘం ఏకగ్రీవంగా నిర్ణయిస్తుందో, వాటిమీద 'ధర్మకర్తృత్వసంఘం' తరపున ఆయా రాజ్యాలకు అధికారం యివ్వబడుతుంది. "ముందు ముందు ప్రపంచ శాంతిని రక్షించేబాధ్యత ఎక్కువగా పెద్దరాజ్యాలమీదే (బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా, రష్యా, చైనా) పడుతుంది. అందువల్ల, ఈ అయిదు రాజ్యాలు కలిసి, ప్రపంచంలోఉన్న కీలకస్థానాలన్నింటి విషయం ఆలోచించాలి." అని ఒక సోవియట్ నిపుణుడు స్పష్టీకరించాడు.

పై ప్రతిపాదనలవల్ల స్పష్టమవుతూన్న విషయంఏమిటి? సోవియట్ ప్రతినిధి భారతదేశంవంటి బానిసదేశాల పక్షం వహించి, వాటికి సంపూర్ణ స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్నాడు. వలసదేశాలపై ధర్మకర్తృత్వం దోపిడీదారులకు కాకుండా, న్యాయపరిపాలనకై కృషిచేసే ఒక సంస్థకు ఉండాలంటున్నాడు. కీలకస్థానాలేవో నిర్ణయించే అధికారం కూడా ఆసంస్థకే ఉండాలంటున్నాడు. ఈ విధంగా, బ్రిటన్-ఫ్రాన్సు - అమెరికా దేశాల సామ్రాజ్యకాంక్షకు సోవియట్ ప్రతినిధులు సమ్మెటదెబ్బ కొడుతున్నారు.

దీనితో, కొందరు సోవియట్ వ్యతిరేకులు నీచమైన దుష్ప్రచారం లేవదీశారు. ఇప్పుడు జపాను కింద వున్న మంచూరియా, కొరియా, ఫార్మోజాలను సోవియట్ స్వాధీనం చేసుకొని, వలసదేశాల సామ్రాజ్యం ఒకటి స్థాపించ దలచుకొన్నట్లు పుకారు పుట్టించారు దీనికి సోవియట్ నిపుణుడు యిలా జవాబు చెప్పాడు: "వలస దేశాల సామ్రాజ్యాన్ని స్థాపించేఉద్దేశ్యం రష్యాకులేదు. బానిసదేశాల దోపిడీకి రష్యా ఒప్పుకోదు. అట్టి సూత్రం రష్యన్ రాజ్యాంగచట్టానికి వ్యతిరేకం."

సోవియట్ సూచనలకు బ్రిటన్, అమెరికాలు పూర్తిగా వ్యతిరేకం. "సంపూర్ణ స్వాతంత్ర్యం" (మిగతా 9వ పేజీలో)

వీరేశలింగ వర్ధంతి జరపండి

★

మే 27 వ తేదీ

ఆంధ్ర సంస్కార సంస్కృతీ వికాసాలకుయుగపురుషుడైన వీరేశలింగం గారిని స్మరించండి!!

★ సంపాదకీయం

సుందరయ్య అరెస్టు

కామ్రేడ్ సుందరయ్యను పోలీసులు అరెస్టుచేసి బందరు సబ్‌జైలులో వుంచారు. ఈ అరెస్టుకు ఆంధ్రావని అంతా ఆశ్చర్యమూ ఆగ్రహమూ వెలిబుచ్చుతూంది. సుందరయ్య భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ సభ్యుడు అఖిలభారత కిసాన్‌సంఘ సంయుక్త కార్యదర్శి. తిండి, బట్టబట్టా లేక అల్లాడుతున్న పీడితప్రజల అభ్యుదయంకోసం విరామమనేది యెరుగక నిరంతరంపోరాడుతున్న యోధుడు.

భారతకమ్యూనిస్టుపార్టీ ప్రజల దైనందిన కష్టాలను నివారించడానికి కంకణం కట్టుకొంది. మనదేశాన్ని ఫాసిస్టు రాక్షసుల బారినుండి రక్షించి స్వాతంత్ర్యం సంపాదింప ప్రతినబూనింది. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధంలో భారతదేశం ప్రముఖపాత్ర వహించాలంటే జాతీయప్రభుత్వం అవసరమనీ, జాతీయనాయకుల విడుదల జరగాలనీ, జాతీయైక్యత కావాలనీ నిరంతరం ఘోషిస్తున్నది.

అఖిలభారతకిసాన్‌సభ, రైతాంగంలో చైతన్యంకలిగించి తిండిదొంగలనుండి, దొంగవ్యాపారులనుండి, రైతులను కాపాడడానికి పూనుకొంది. కరువుకాటకాలనుండి దేశాన్ని రక్షించడానికి అధికోత్పత్తికై రైతులను ప్రబోధించుతూంది.

ఈ రెండు సంస్థలలోను ప్రధానబాధ్యత వహించి పని చేయుచున్న కామ్రేడ్ సుందరయ్య చేసిన నేరం ఏమిటి?

నేడు యుద్ధపరిస్థితులను అదునుగా తీసుకొని, తిండిదొంగలు, దొంగవ్యాపారులు, వారికి సాయపడే లంచగొండి ఉద్యోగులు ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. ప్రజల మానాల్ని మంటగలుపుతున్నారు. కంట్రోలు పద్ధతిని భగ్నపరచి, ప్రజలకు ఆహారం దొరకకుండా చేస్తున్నారు. బెంగాల్, విశాఖ, రాయలసీమలాంటి క్షామాలకు కారణం ఈ స్వార్థపరులే. ఈనాడు కట్టుబట్ట లేకుండాచేసి, మానం తీసివేస్తున్న అమానుషులు వీరే. రైతులకు ముఖ్యఅవసరాలైన పట్టాలు, పారలు, గునపాలు, ఎరువులు దొంగషాపులలో నిలవజేసి, చీకటి బజార్లలో అంతులేని వెలలకమ్మి, రైతుల రక్తం పిండుతున్నది వీరే. కార్మికులు రాత్రింబవళ్లు కష్టపడి తెచ్చుకొన్న నాల్గురాళ్లూకూడా, ఈ దురాశాపరుల పొట్టలలోబడి, పట్టెడు మెతుకులకూ, జానెడు గుడ్డకూ, బుడ్డెడు కిరోసిన్‌కూ గూడా గతిలేకుండా అల్లాడుతున్నారు.

ఇట్టి స్వార్థపరులైన తిండిదొంగలనుండి, దొంగవ్యాపారులనుండి తమ్ముతాము రక్షించుకోవాలని ప్రజలను ప్రబోధించాడు సుందరయ్య. అధికోత్పత్తి గావించి, తోటి మానవులను రక్షించవలసిందని ఉద్బోధించాడు సుందరయ్య. కాలువలు, చెరువులుమరమ్మతుచేసి, పంటనెక్కువచేయండని ఆదేశించడమేగాక, స్వయంగా తానాపనులలో పాల్గొని రైతాంగాన్ని ఉత్సాహపరిచాడు. వ్యవసాయకూలీలకు బంజరు భూములీయాలని, బంజర్లను సాగులోకి తీసుకురావాలని ఆందోళన చేశాడు. ఫాసిస్టువినాశనంలో ఇతర దేశాల కార్మికుల మహోజ్వల పాత్రయేమిటో తెలియజెప్పి, మనదేశంలో మన కార్మికులు నిర్వహించవలసిన పాత్ర యేమిటో వివరించాడు. ఆంధ్రదేశమంతటా జరిగిన అనేక రైతు సభలలో సుందరయ్య గావించిన ఉపన్యాసాలలో నేమి, చేసిన కార్యకలాపాలలోనేమి, ప్రత్యక్షంగా కన్పడుతున్నదిదే.

నేడు శిక్షించవలసినది ప్రజా జీవితమే భగ్నంచేసే తిండి దొంగలను, బట్టదొంగలను, ఇంకా వీరికి సాయపడుతున్న లంచగొండులైన కొందరు ప్రభుత్వోద్యోగులను. కాని, ప్రభుత్వం వీరిని విడిచి ప్రజా సేవకులైన సుందరయ్యలాంటి వారిని అరెస్టు చేయడంలో అర్థమూలేదు, వివేకమూ లేదు. స్థానికాధికారుల ఇట్టి అవకతవక చర్యలను అరికట్టకపోతే, ప్రభుత్వం అనుసరించే విధానం తీవ్రపరిస్థితులకు కొనిపోతుందని హెచ్చరిస్తున్నాం.

కామ్రేడ్ సుందరయ్యను విడుదల చేయించుకొనడం, రైతుల, కూలీల, పౌరసత్వ హక్కులగోరే దేశభక్తుల కర్తవ్యం. సుందరయ్యను విడుదల చేయాలని ఆంధ్రదేశమంతటా ఆందోళనచేయాలి. రైతుసంఘాలు, కూలీ సంఘాలు, వివిధ ఇతర సంస్థలూ, ఆందోళనగావించి తమ నాయకుడైన సుందరయ్యగారిని విడిపించు కొంటారని ఆశిస్తున్నాము.

ఆంధ్ర కాంగ్రెసు పెద్దలు అమలుపరుస్తున్న నిర్మాణ కార్యక్రమ మేమిటి?

డాక్టరు పట్టాభి, ప్రకాశంగారలవంటి ఏ ఒక్కరో, ముగ్గురో మినహా, ఆంధ్రకాంగ్రెసు నాయకులంతా జైళ్ళనుండి విడుదలయ్యారు. 42 ఆగష్టునుండి కాంగ్రెసు పేరుతో అనేకమంది కమ్యూనిస్టులపై చేస్తున్న నీచాతినీచ నిందా ప్రచారాన్ని వీరు అరికడతారని, ఆంధ్ర ప్రజారాజకీయ జీవితాన్ని ఆరోగ్యప్రద మొనర్చుతారని, ఆంధ్రప్రజలంతా ఆశించారు. కాని ఆశలన్నీ అడియాసలయ్యాయి. కమ్యూనిస్టు వ్యతిరేక పోరాటమే భారతస్వాతంత్ర్య పోరాటమంటూ నినాదాలిస్తున్న రంగా, కాశేశ్వరరావుగార్ల వినాశకర రాజకీయాలనే ఆంధ్రకాంగ్రెసు అసెంబ్లీ నాయకత్వం అనుసరిస్తోంది.

కమ్యూనిస్టులపై దుష్ప్రచారం

'సత్యం, అహింస' సిద్ధాంతాలతో కూడుకొన్న నిర్మాణ కార్యక్రమాన్ని ఆంధ్రలో సాగించడానికి కాంగ్రెసు అసెంబ్లీని ఏర్పరచామని ఏలూరులో కాంగ్రెసు అసెంబ్లీ సమావేశమప్పుడు ఈ నాయకులంతా ప్రకటించారు. కాని అప్పటినుండి యిప్పటివరకు ఆంధ్ర కాంగ్రెసు అసెంబ్లీ నాయకమ్మన్యులు సాగిస్తున్న నిర్మాణ కార్యక్రమమేమిటి?

ఏలూరులో శ్రీయుత కొట్రగడ్డ నారాయణరావుగారిని కాంగ్రెసు అసెంబ్లీ వాలంటీర్లు కొట్టడంతో ఆంధ్ర కాంగ్రెసునాయకుల అహింస, సత్యాల (?) తో కూడుకున్న నిర్మాణ కార్యక్రమం ప్రారంభమైంది. అక్కడనుండి ఆంధ్రదేశమంతటా కమ్యూనిస్టువ్యతిరేక సంచారం సాగించారు. చివరకు అమృతలూరుదెబ్బలాటకు దారితీశారు. ప్రజలకు వీరిచ్చేసందేశమేమిటి? కమ్యూనిస్టువ్యతిరేకత! ప్రజాసంఘాలవిచ్ఛిన్నం! పోటీసంఘాల నిర్మాణం! సోవియట్‌పై దుష్ప్రచారం! కాంగ్రెసు అసెంబ్లీ నాయకమ్మన్యులైన రంగా, కాశేశ్వరరావు, చంద్రమౌళిగార్లు సాగిస్తున్న నిర్మాణకార్యక్రమంలో యెంత సత్య, అహింసలు వున్నదీ యిదివరకు "ప్రజాశక్తి" వ్యాసాలలో రుజువుచేశాం. ఇప్పుడు మరికొన్ని అబద్ధపు ప్రకటనలను యెత్తిచూపుతాను.

తెనాలితాలూకా కాంగ్రెసు అసెంబ్లీపేరిట అమృతలూరు దెబ్బలాటల్నిగూర్చి ఒక కరపత్రం వేశారు. అందులో స్త్రీలు, పిల్లలు, కిసానులు దారిని పోతుంటే, కమ్యూనిస్టులు పైనబడ్డారని వ్రాశారు. ఇది శుద్ధ అబద్ధం. ఏ స్త్రీపైగాని, బిడ్డపైగాని చీమ చిటుక్కుమందేమో రుజువుచేయమని సవాలుచేస్తున్నాను. స్త్రీలపై, బిడ్డలపై, దాడిచేశారని, అబద్ధ ప్రచారంతో ప్రజాసానుభూతిని సంపాదించ చూడటం సాహసంసుమా! దారినపోతున్న కిసానులను పొంచికొట్టారని మరొక అబద్ధం. దారినిపోయ్యే వారిపైనే కమ్యూనిస్టులు దౌర్జన్యం చేస్తే, తన్నులుతిన్న వారిలో ఒక్కరు తప్ప అందరూ అమృతలూరు జెట్టీలే యెందుకున్నారో! వీరే కాబోలు "దారినపొయ్యే అమాయక కిసానులు"!! అహింసా వ్రతులైన కాంగ్రెసు కిసానులు శాంతినివీడి, దౌర్జన్యానికి దిగలేదని యింకొక కారు-అబద్ధం. కామ్రేడ్ బసవయ్య తల పగలగొట్టింది. కామ్రేడ్ అన్నారెడ్డి తల చిట్లగొట్టింది. మరో అయిదుగురు కామ్రేడ్సును బలమైన కర్ర దెబ్బలు కొట్టింది ఏశాంతి దూతలో పాపం!

బరిసెలతో పొడిచావని, ఇంకేమేమో వాడారని ఊరూర తప్పుడు ప్రచారం గావించి ప్రజలను ఉద్రేకపర్చ చూస్తున్నారు. అహింస, సత్యం పేరిట ప్రారంభించిన నిర్మాణ కార్యక్రమం ఇదే అయితే, అది మాకక్కర్లేదుబాబో అని ఆంధ్ర ప్రజానీకం అలమటించక మానదు.

బూతుల బుర్రకథలు

కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువయిన కొలనీ, వారుగ్రామాల్లో ప్రజల దైనందిన సమస్యలు తీసుకొని వర్గ సంఘాలద్వారా పోరాడుతున్నారు. అన్ని రకాల దోపిడీ విధానాన్ని యెదుర్కొంటున్నారు. దీంతో కూలీల నోళ్లు కొట్టుకుతినే కూలీ వ్యతిరేకులు, రైతుల పొట్టలుగొట్టే కర్రపెత్తందార్లు, టొట్లు, జూదరులు, లంచగొండులు, త్రాగుబోతులు, వ్యభిచారులు - యిలాంటి కుష్ఠురకమంతా వారి బ్రతుకు తెరువుకు ఇబ్బందివచ్చి, కమ్యూనిస్టు వ్యతిరేకులవుతున్నారు. ఇలాంటి వాళ్ళను రంగా, కాశేశ్వరరావు, చంద్రమౌళి ప్రభృతులు చేరదీస్తున్నారు. వీళ్ళద్వారా ఎట్టి ఉద్యమం నిర్మిస్తున్నారో చూదాం.

పులిని చూచి నక్క వాతపెట్టుకున్నట్లు, ప్రజలలో రాజకీయ విజ్ఞానప్రచారానికి కమ్యూనిస్టులు బుర్రకథలు చెబుతూంటే, వాటికి

ఎం. బసవపున్నయ్య

ఇమిటేషన్‌గా కమ్యూనిస్టులను బూతులు తిట్టేకథలు ప్రారంభించారు. తెనాలి తాలూకా జాగర్లమూడిలో స్థానిక కాంగ్రెసు ప్రబుద్ధుడు బూతుల భావయ్య, త్రాగుబోతు అప్పయ్య (ఈయన ఒక ఖూనీ కేసులో ముద్దాయి) కలసి కమ్యూనిస్టులను తిట్టడానికి ఒక బూతుల బుర్రకథ పెట్టించారు. ఆఊరిలోని కమ్యూనిస్టు కామ్రేడ్స్ గ్రామ పెద్దలవద్దకు వెళ్ళి, ఆచెప్పే బుర్రకథ యెలా బూతులకథ అయిందీ, దాన్ని నివారించవలసిన అవసరాన్ని, ముందుగా వివరించారు. దానితో కథ ప్రారంభమైన ఒక అరగంటకు ఆగ్రామ పంచాయితీబోర్డు ప్రెసిడెంటు, పరుచూరు శివలింగయ్యగారు లేచి "ఆ బూతులను ఆపండి; ఇందుకేగదా మీరెక్కడికి పోయినా తగాదా కొనితెస్తారని" చివాట్లుపెట్టి కథను ఆపించారు. అంతటితో కళ్ళుతెరచి కాసేపు మరొక కవాకాలక్షేపంచేసి కొంపకు చేరుకున్నారు.

జంపని గ్రామంలోకూడ (తెనాలితాలూకా) యిలాంటి బుర్రకథే ఒకటి పెట్టించారు. దానికి స్థానికంగా దేశభక్తులమని చెప్పుకునే వారందరూ మద్దతు. వారిలో యిద్దరు ముగ్గురికి చిట్లాట, జూదం, త్రాగుడు నిత్యజీవితం! కమ్యూనిస్టులను ఆడిపోసే బూతుల కథ కాబట్టి కమ్యూనిస్టులతో దెబ్బలాటవస్తుందని, దరెశెల ప్రదర్శనతో 'అహింసా సత్య' వ్రతులైన ఆదేశభక్తులు కాపలా కాశారు.

"వెంగమ్మ" నాటకం

"సుందర్యా" అనే దొంగకమ్యూనిస్టు వెంగమ్మ అనే ఇల్లాలిని మోసంచేసి, లేవ తీసుకొని పోయినట్లు, తుదకు ఆమె నగలు—నాణ్యాలు కాజేసి, దిక్కు దివాణం లేకుండా వదలేసినట్లు ఒక బూతుకథతో వ్రాసిన నాటకమిది. ఈ బూతునాటకం వ్రాసినది యడ్లపల్లి కోటయ్య. ఇతగాడు వ్యక్తిసత్యాగ్రహంలో జైలుకు వెళ్ళి, కాంగ్రెసు బురఖా తగిలించుకున్నాడు ఏకోశమందు దేశభక్తిలేదు. కల్లూరి చంద్రమౌళి వగైరా నాయకమ్మన్యులు ఈ "వెంగమ్మ" నాటకాన్ని ప్రోత్సహించుతున్నారు. నేను, కడియాల గోపాలరావు, ముక్కామల నాగభూషణం, రావి అమ్మయ్య గార్లు యీమధ్య రైతుసంఘం తరపున చంద్రమౌళిగారితో మాట్లాడటానికి వెళ్ళినప్పుడు, మాటల సందర్భంలో ఆయన "వెంగమ్మ" నాటకాన్ని సమర్థించాడు; అది ఒక దృక్పథం అని వాదించాడు. గుడ్డికమ్యూనిస్టు వ్యతిరేకతతో కాంగ్రెసు అసెంబ్లీ పెద్దలు యెంత పతనమై పోతున్నారో, ఆంధ్ర రాజకీయాలను యెంత కలుషిత మొనర్చుతున్నారో, దీనివల్ల బోధపడుతుంది.

రేపల్లె తాలూకాలో గూడవల్లి అనే గ్రామముంది. ఆవూళ్లో ఎప్పుడూ కోర్టులవెంట తిరిగే గోగినేని బాపయ్య అను ఒక వ్యాజ్యాలకోరు ఉన్నాడు. ఆయన కాంగ్రెసుకు కట్టువ్యతిరేకి. ప్రభుత్వోద్యోగుల గోచీలు పట్టుకు ప్రాకులాడే ఆ గులాముకు కమ్యూనిస్టులంటే కంటకంగా వుండటం సహజం. ప్రస్తుతం జరుగుతున్న ఈ కమ్యూనిస్టు వ్యతిరేక కాంగ్రెసు ప్రచారం చూచి, చంకలు కొట్టాడు. ఆవూరిలోని అమాయక కాంగ్రెసు అభిమానుల్ని రెచ్చగొట్టి, "వెంగమ్మ" నాటకం వేయించాడు. ఇలాంటి సంఘటనే మరొకటి. దోనేపూడిలో వెనిగెళ్ల శేఖరం అనే ఒక లక్షాధికారి ప్రోత్సాహంతో ఒకనాటి రాత్రి "వెంగమ్మ" నాటకం వేశారు. ఆయనకున్న లక్షలు కమ్యూనిజం వస్తే ఏమైపోతాయోనని యిప్పటినుండీ గుండె దడ కాబోలు!

ఒకరిద్దరు కమ్యూనిస్టులుమాత్రమే ఉన్న ఇలాంటి ఊళ్లలో కమ్యూనిస్టుల్ని బూతులు తిట్టే ఈ నాటకం వేయడం కయ్యానికి కాలు దువ్వడమేనని వేరే చెప్పనవసరంలేదు. ఆత్మరక్షణకు కమ్యూనిస్టులు పూనుకుంటే, కాంగ్రెసువారిపై దౌర్జన్యం చేశారని లబోమని మొత్తుకుంటూ అబద్ధపు ప్రకటనలతో రంగా, కాశేశ్వరరావు, చంద్రమౌళిగార్లు తయారు!

పిచ్చిచేష్టలు శృతిమించుతున్నాయి

తెనాలితాలూకా ఐతానగరపాలెంలో నన్నపనేని వెంకట్రావు అనే కాంగ్రెసు ప్రబుద్ధుడు (గుంటూరుజిల్లా కాంగ్రెసు అసెంబ్లీ అధ్యక్షుడు) ఆవూరిలో జాతీయ బాలసంఘ మొకదాన్ని స్థాపించాడు. ఆ బాలసంఘంచేత చేయించే నిర్మాణ కార్యక్రమం వివరిస్తాను. జట్టి రాఘవేంద్రరావనే కమ్యూనిస్టు పార్టీ సభ్యుని యింటిపై రాత్రివేళ రాళ్లురువ్వించాడు. గుంటూరుజిల్లా రైతుమహాసభ జరిగిన కతెవరం ఆశ్రమప్రాంతంలో ప్రతిష్ఠించిన రెండు ఎర్రజెండాలను దొంగతనంగా ఊడదీసికొనివచ్చి, జోషీబొమ్మతో కలిపి ఊరేగించి, తగులబెట్టించాడు. కమ్యూనిస్టుల్ని సానుభూతిపరుల్నీ, రెచ్చగొట్టడానికి ఆపిల్లలచేత బూతులు కూయిస్తున్నాడు. హిట్లరు కూడా ఈ విధంగానే ఉగ్గుపాలతో కమ్యూనిస్టు వ్యతిరేకత రంగరించిపోసి, జర్మనుజాతిని మారణహోమంలోకి నెట్టాడు. నిర్మాణ కార్యక్రమంపేరిట జరిగే యీపాపం ఎట్లా పండనున్నదో చరిత్రగాని చెప్పలేదు.

జంపని, పెదవడ్లపూడి (తెనాలితాలూకా), గ్రామాలలో ఈ మధ్య రెండు వివాహాలు జరిగాయి. కమ్యూనిస్టులు భోజనాల వద్దనకు తోడ్పడుతున్నారు. కాంగ్రెసువాదుల మనుకొని విర్రవీగే కొందరు ఆగతాయి రకం లేచి, కమ్యూనిస్టులు వడ్డిస్తే మేము తినమంటూ కేకలు సాగించారు. ఈ రస పిచ్చిగాళ్ళతో వాదనపెట్టుకుంటే శుభకార్యం రసాభాస అవుతుందని కామ్రేడ్సు శాంతంగా వైదొలిగారు. పెదవడ్లపూడి గ్రామంలో జరిగిన పెండ్లిలో వధువుకు మహిళా సంఘాల ద్వారా కమ్యూనిస్టుపార్టీ అంటే సానుభూతి. వరునికి ప్రేమ పూర్వకంగా ఒక ఉంగరం చేయించి, దానిపై సుత్తీకొడవలి చిహ్నం వేయించారు. వరుని తరపునవున్న ఒక రంగా శిష్యుడు ఆ ఉంగరాన్ని లాక్కుని, రాతితో నలగగొట్టాడు!

అమృతలూరులో ఒక కమ్యూనిస్టుపార్టీ సభ్యుని యింట వివాహం జరిగింది. పెండ్లి పందిరిపై ఎర్రజండా ఎగురవేశారు. చుట్టాలుగా వచ్చిన ఇద్దరు జంపని దేశభక్తులు ఆ జెండా దింపితేగాని, పందిరిలోకి రామని అలిగారు. 'జీవితాశయ చిహ్నమైన జెండాను నేలవాల్చడంకంటె మీ బంధుత్వాన్నికే నీళ్ళు వదులుకుంటాము' అని మొరాయించేటప్పటికి మొఖం వేలవేసుకుని ఆ దేశభక్తులు నోరుమూసుకున్నారు.

కమ్యూనిస్టులతోకలసి ప్రజాసేవ జేయడం కంటె బ్రిటిష్ ప్రభుత్వంతో చేతులు కలపడానికి సిద్ధపడుతున్న రంగా, చంద్రమౌళి, కాశేశ్వరరావుల (అమృతలూరు దెబ్బలాటపై వీరి ప్రకటనలు చూడండి) దుష్ప్రేరణలు ఆంధ్ర కాంగ్రెసునూ, దేశభక్తుల్నీ యేసుడిగుండంలోకి ఈడుస్తున్నాయో స్పష్టమౌతోంది.

ప్రజలకు విజ్ఞప్తి

ఆంధ్రదేశ మంతటా కాంగ్రెసు అసెంబ్లీ పెద్దలు నిర్మాణ కార్యక్రమంపేరుతో, సత్య అహింసల పేరిట, గావిస్తున్న ప్రచార ఫలితం యిదంతా. రంగా, చంద్రమౌళి, కాశేశ్వరరావులు గావిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక దుర్బోధనలే ఊరూర దెబ్బలాటలకు, నీచాతినీచమైన బూతుల ప్రచారానికి, దోపిడీగాండ్రు, జూదర్లు, లంచగొండ్లు, త్రాగుబోతులు, వ్యభిచారులు - ఇలాంటివారిని రేగగొట్టి ప్రజా జీవితాన్నంతా కలుష పర్చేందుకు దారితీస్తున్నాయి. ఇలాంటివారిని కాంగ్రెసు పెద్దలు ప్రోత్సహించడంవల్ల కాంగ్రెసు సాంప్రదాయాన్నీ, జాతీయోద్యమాన్నీ ముందుకు తీసుకుపోతున్నారో, లేక మంటగల్పి (మిగతా 8వ పేజీ)

ఆరకన్ గెరిల్లానాయకుని వీరగాథ

[రెండు సంవత్సరాలుగా బ్రిటిష్, అమెరికన్ సైనికులు ఆరకాన్ (బర్మా) ప్రవేశించడానికి విశ్వప్రయత్నం చేశారు. లాభం లేకపోయింది. ఈ మధ్యనే, అకస్మాత్తుగా, ఆరకాన్ మిత్రసేనలకు వశమైనట్టు పత్రికల్లో వార్త వచ్చింది. ఇది ఎలా సాధ్యమైంది? అసలు రహస్యాన్ని ఏ పత్రికా బయటపెట్టలేదు. "పీపుల్సువార్" 8—4—45 సంచికలో మొట్టమొదటిసారి వివరాలు ప్రచురింపబడ్డాయి. ఆరకాన్ గెరిల్లా యోధులు జపాన్ సేనలపై జరిపిన వీరోచిత పోరాటాలు ఆ వ్యాసంలో చిత్రించబడ్డాయి. వారినాయకుడైన పిన్నయ తైహా జీవితసంగ్రహం యిచట ముద్రిస్తున్నాం.]



పిన్నయ తైహా మొదట ఆరకాన్ బౌద్ధ భిక్షువుల సంఘంలో విద్యాశాఖకు కార్యదర్శిగా ఉండేవాడు. ప్రజలకు యేదోవిధంగా సహాయంచేస్తూ ఉండేవాడు. బ్రిటిష్‌పరిపాలనకింద ఆరకాన్ ప్రజలు అనుభవించే బాధలు చూచాడు. వారిని స్వాతంత్ర్య పోరాటానికి ఆయత్తపరిచాడు. అంతవరకు ఆరకాన్‌లో రెండు ప్రధాన రాజకీయసంస్థలు ఉండేవి: ఒకటి అఖిల ఆరకాన్ ఎసోసియేషన్, రెండవది యువజనసంఘం. ఈరెంటినీ 1939లో పిన్నయతైహా ఒకటిగా చేశాడు. అదే ఆరకాన్ నేషనల్ కాంగ్రెసు.

వెంటనే, బ్రిటిష్ ప్రభుత్వం ఇతనిమీద వారంటు జారీచేసింది. జూన్ 1939 లో అరెస్టుచేయబడ్డాడు. విచారణ జరిగిన తరువాత, 1 సంవత్సరం కఠినశిక్ష విధించారు.

ప్రజలు తమ నాయకుని విడిపించుకోడానికి ఎంతో ఆందోళన గావించారు. అప్పీలులో ఒక ముస్లిం దేశీయుడు యితని కేసు వాదించి, సంవత్సరం కఠినశిక్షను 9 రోజులకు తగ్గించగలిగాడు.

బ్రిటిష్‌ప్రభుత్వంపై తిరుగుబాటు సన్నాహం

తరవాత, 1939-40-41 సంవత్సరాలలో యితను మొదట బహిరంగంగాను, తరవాత రహస్యంగాను, బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు లేవదీయడానికి ప్రజల్ని సమీకరించాడు. ఆరకాన్ నేషనల్ కాంగ్రెసు నాయకులందరూ ఒక్కరొక్కరే అరెస్టు చేయబడ్డారు. కొందరుసహచరులతో పిన్నయ తైహా రహస్య జీవితం ప్రారంభించాడు. పోలీసులకు పట్టుబడకుండా రైతులు యితన్ని తమ ప్రాణంలా కాపాడారు.

పల్లెటూళ్ళలో పిన్నయ తైహా స్వాతంత్ర్య ప్రబోధం చేయడంతోబాటు, రైతుల నిత్యజీవితంలో లీనమై వారి కష్టాలు తొలగించడానికి యెన్నో విధాల సహాయం చేసేవాడు.

బ్రిటిష్ వ్యాపారస్థులు చిట్టగాంగ్‌నుంచి చౌకగా కూలీజనాన్ని తెచ్చి, ఆరకాన్‌లో వారిచేత పనిచేయించుకోడం పరిపాటి. ఈ విధానంవల్ల వందలకొద్ది ఆరకాన్ కూలీలు నిరుద్యోగులౌతూండడం పిన్నయ తైహా చూచాడు. వెంటనే ఆరకాన్ ఫ్లోటిల్లాకంపెనీ యజమానులమీద ఒత్తిడితెచ్చి, ఆరకాన్ కూలీల్నే నియమించేలా చేశాడు. కూలీలు, తమ తమ గ్రామాలనుంచి పడవలమీద వెళ్ళవలసి వచ్చేది. వారికి ముఖ్యమైన కొన్ని సౌకర్యాలు కలిగించాడు.

బ్రిటిష్ పెట్టుబడిదారులు ఆరకాన్‌లో 7 కాగితపు మిల్లులు స్థాపించ నిశ్చయించారు. ఆరకాన్ అడవుల్లో వెదురు బాగా లభిస్తుంది. చౌకబారు ఇండియన్ కూలీలతో దాన్ని కాగితంగా తయారుచేసి లాభాలు గడిద్దామని వారు నిశ్చయించుకున్నారు. ఆరకాన్ ప్రజలకు యివి ఏవిధంగాను సాయపడవు. విదేశీ పెట్టుబడిపెట్టి, విదేశీ కార్మికుల్ని దిగుమతిచేసి, ఆరకాన్‌యొక్క సంపదను కొల్లగొట్టడానికే యీ ప్లానంతా అంటూ ఆరకాన్ అంతటా ఒక తుపాను లేవదీశాడు పిన్నయతైహా. కొద్దిరోజుల్లో ఆపెట్టుబడిదార్లు తమస్కీమును వదలుకోవలసివచ్చింది.

లంచగొండి ఉద్యోగస్థుల దుర్నీతివి యితను ప్రజల యెదుట బాహాటంగా బయటపెట్టేవాడు. లంచాలు పుచ్చుకొని ప్రజల్ని దోచుకుతినే ఒక ప్రభుత్వోద్యోగిమీద అనేక గ్రామాల్లో సంఘబహిష్కారం ప్రవేశపెట్టించాడు! కొన్నాళ్ళకు ప్రభుత్వం దిగివచ్చి ఆ దుర్మార్గుని డిస్మిస్ చేసింది.

ఈ విధంగా పిన్నయ తైహా ఆరకాన్ ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. అతని పేరు వినని ఆరకాన్ దేశస్థుడు లేడనే చెప్పాలి. ఎక్కడ బహిరంగసభ జరిగినా పది పదిహేను వేలకు తక్కువకాకుండా ప్రజలు వచ్చేవారట.

జపాను ఆక్రమణ

జపాన్ సేనలు బర్మాలోకి తోసుకువస్తూంటే, బ్రిటిష్ పరిపాలన యిక ఆరకాన్‌లో అంతమయి, తన ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చగలుగుతారని యితను ఆశించాడు.

జపానుఅధికారులు తెలివైనవారు. "బర్మా స్వాతంత్ర్యసేన" అనేపేరుతో ఆరకాన్‌కి బర్మా సైనికుల్ని దింపారు. పిన్నయతైహా అనుచరులు వారికి స్వాగత మిచ్చారు. కొన్నాళ్ళయాక, జపాన్ సేనలే వచ్చాయి. ఇందుకు కారణం జపాన్ వారెంతో చక్కగా ఆరకాన్ దేశభక్తులకు నచ్చేటట్లు చెప్పారు. బ్రిటిష్‌వాళ్ళను తరిమివేయడానికే తాము ఆరకాన్ వచ్చామన్నారు. ఇందుకు సైన్యాలు అవసరమన్నారు. సివిల్ పరిపాలన దేశభక్తులకే ఇచ్చివేస్తామన్నారు. ఇందుకు ప్రత్యుపకారంగా, తమ సేనలు ఆరకాన్‌లో ఉన్నంతకాలం ప్రజలు తమకు సహాయం చేయవలసిందని కోరారు. సివిల్ పరిపాలనా శాఖకు పిన్నయతైహాను అధికారిగా నియమించారు! వెంటనే ప్రజలకు, దేశభక్తులకు, జపాన్ అధికారులమీద విశ్వాసం కలిగింది. ప్రతి గ్రామంలోను, పట్టణంలోను, "శాంతి సంరక్షణ సంఘాలు" ఏర్పాటైనాయి. (పంచాయితీ బోర్డులు, మ్యునిసిపాలిటీల లాంటివి) "ఆరకాన్ ఆత్మరక్షణ సైన్యం"కూడా ఒకటి స్థాపించబడింది.

పిన్నయతైహాకి ప్రభుత్వంలో ఉన్నత పదవి దొరికినప్పటికీ, ప్రజల్ని మాత్రం మరువలేదు. తనకు అవకాశం ఉన్నంతవరకు ప్రజలకుసహాయం చేసేవాడు.

మైకం తొలగ నారంభించింది

క్రమంగా, జపాన్ అధికారుల నిజస్వరూపం ఆరకాన్ దేశభక్తులకు కనపడింది. జపాన్ సైనికులు ధాన్యపు పురులకు తాళాలు వేసి, వాటిని స్వాధీనం చేసుకోసాగారు. రైతులు బియ్యం మార్కెటు ధరలో పదవవంతుకుతక్కువగా సైనికులకు అమ్మవలసివచ్చింది. కలపకోసం రైతులు నివసించే యిండ్లను నేలమట్టంచేయసాగారు. స్త్రీ పురుషులచేత నిర్బంధంగా వెట్టి చేయించుకోనారంభించారు.

మొదటిదశలో, యిలాంటి "త్యాగాలు" చెయ్యాలి కాబోలునని ఆరకాన్ నాయకులు పట్టించుకోకుండా ఊరుకున్నారు! కాని, అధికారుల నిరంకుశత్వం అంతకంతకు భరించరానిదయింది. "ఆరకాన్ శాంతి సంరక్షణ సంఘాలు" ఎట్టి అధికారంలేని కీలుబొమ్మలుగా తయారయాయి. పైనుంచి ఉత్తరువు లేవైనా వస్తే, కిక్కురుమనకుండా వాటిని అమలుజరపాలి. ఇక "ఆరకాన్ ఆత్మరక్షణ సైన్యం"లోని వారిని జపాన్ అధికారులు కూలీలుగా వినియోగించేవారు.

పిన్నయ తైహా ఇదంతా చూచాడు. ఆరకాన్ ప్రజల ఆక్రందనాలను అధికార్లకు వినిపించడానికి రంగూన్ వెళ్లాడు. (జనవరి 1943). రంగూన్‌లో "స్వతంత్ర బర్మా ప్రభుత్వం" యొక్క కార్యాలయం ఉంది. అక్కడికివెళ్ళి, ఆరకాన్‌సమస్యల్ని పరిష్కరించడానికి మరొక కొత్త మంత్రిని నియమించవలసిందని కోరాడు. కొద్దిగంటల సంభాషణతో అతనుతెలుసుకున్న విషయం ఏమంటే "స్వతంత్ర బర్మా ప్రభుత్వం" కంటె ఆరకాన్ "శాంతి సంరక్షణ సంఘాల"కే ఎక్కువ స్వతంత్రం ఉంది!

ఇలా "స్వాతంత్ర్యం" అనే పేరుతో ఇన్నాళ్ళనుంచీ జపాన్ అధికారులు బర్మా ప్రజల్ని యెలా మోసగించుతున్నారో పిన్నయతైహా అర్థంచేసుకున్నాడు. ఒక్కసారి మైకం అంతా తొలగిపోయింది!

జపాన్ అధికారుల అత్యాచారాలు

ఆరకాన్‌కి తిరిగివచ్చి, తన ప్రజల్లో స్వాతంత్ర్య ప్రబోధం ప్రారంభించాడు జపాన్ అధికారుల బూటకత్వాన్ని బయటపెట్టసాగాడు. సివిల్‌పరిపాలన అంతా, పైనుంచి కిందివరకూ, జపానుకు వ్యతిరేకంగా తిరిగింది. వెట్టిచాకిరి చేయవద్దని, ఆహారపదార్థాలు సైనికుల కంటబడకుండా దాచేయవలసిందనీ, ప్రచారం ఆరంభించారు. ప్రజలు యీ ఉత్తరువులను ఆచరణలో పెట్టారు. దీనితో, జపాన్ అధికారుల క్రౌర్యం మరింత రాక్షసరూపం దాల్చింది. రైతులపశువుల్ని బలవంతంగా చంపేశారు. ఊళ్ళమీదపడి, దోపిడి చేశారు. స్త్రీలను చెరిచారు. పిల్లల్ని హత్యచేశారు. విచక్షణ లేకుండా, వందలకొద్దీ అమాయక ప్రజల్ని "కమ్యూనిస్టు"లనీ, "బ్రిటిష్ ఏజంట్లు"అనీ, పట్టుకొని ఉరితీశారు.

గెరిల్లా దళాలు

ఈ దాడిని ఎదుర్కొడానికి ఆరకాన్ ప్రజలలో చాలమంది గెరిల్లాసైనికులుగాచేరి, అడవుల్లో దాక్కొని, జపాన్ సేనలమీద చాటుయుద్ధం ప్రారంభించారు. దీనితో, జపాన్ అధికారులు ఉన్మత్తులవలె ప్రజలమీద ఎన్ని అత్యాచారాలు చెయ్యాలో అన్నీ చేశారు. భర్తలయెదుట భార్యల్ని మానభంగం చేశారు. తల్లులయెదుట పిల్లల్ని చిత్రవధ చేశారు. గ్రామాలకు నిప్పంటించారు. జంతువుల్ని వేటాడినట్లు మనుష్యుల్ని వేటాడారు.

ఈ హత్యాకాండ ఆరకాన్ గెరిల్లాల స్వాతంత్ర్య జ్యోతిని ఆర్పలేదు, పైగా, యినుమడించిన ఉత్సాహంతో చాలమంది గెరిల్లాలుగా చేరసాగారు.

ఈ గెరిల్లాలకు నాయకత్వం వహించినవారిలో పిన్నయ తైహా ఒకడు.

జపాన్ సేనలు ఆరకాన్‌నుండి వెనుకమొగంపట్టే నాటికి మొత్తం 400 మంది చేతుల్లో మిత్రసేనలిచ్చిన ఆయుధాలున్నాయి. జపాను సైనికుల్ని నిరాయుధులుగా చేసి సంపాదించిన ఆయుధాలతో మరో 1000 మంది, ఎప్పుడు ఆయుధాలువస్తే అప్పుడు రంగంలో దూకడానికి సిద్ధంగా ఉన్నవారు 5000 మంది - ఇలా గెరిల్లా ఉద్యమం నానాటికి అభివృద్ధి చెందింది. మొత్తం 400 గ్రామాలలో వీరికి బలంఉంది. కొన్నివేలమంది జపానీయుల్ని వీరు సంహరించారు.

ఈ గెరిల్లాలు అనేక పట్టణాలను సహితం స్వాధీనం చేసుకున్నారు. మిత్ర సేనలు అక్యాబు పట్టణం ప్రవేశించడానికి చాలా రోజులకు ముందే, ఆపట్టణాన్ని జపాన్ సేనలు ఖాళీచేసి వెళ్ళిపోయినట్లు బ్రిటిష సైన్యాధికారులకు వార్త పంపించారు!

ప్రస్తుతం ఆరకాన్ గెరిల్లాలు తమ రాష్ట్రాన్ని యెదుర్కొనే ఆర్థిక, సాంఘిక సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్నారు. జపాన్ సేనల్ని చెండాడ్డంలో విదుపము సాహసం ప్రదర్శించిన యీ ఆరకాన్ దేశభక్తుల్ని బ్రిటిష్ అధికారవర్గం తిరిగి బానిస జీవితానికి గురిచేయడం సులభమైన పనిగాదు. —('పీపుల్సువార్' నుండి)

కార్మికుల సాంఘిక జీవిత సౌకర్యాల స్కీము

బ్రిటను, అమెరికా, ఆస్ట్రేలియా మొదలగు దేశాల్లో ఆయా ప్రభుత్వాలు కార్మికుల జీవిత సౌకర్యాలకు కొన్ని స్కీములు తీసుకు వచ్చాయి. యుద్ధానంతరం ప్రజలు నిరుద్యోగులై, జీవనాధారం పోకుండా చేయాలనీ, శాంతిస్థాపనకు కార్మికులజీవనాధారాన్ని కాపాడ్డం ప్రధానమనీ, గుర్తించబడింది. ఇంతకు ముందెప్పుడు కూడ యింత సమగ్రమైన ప్లానుతో సాంఘిక సహాయ పద్ధతులు అమల్లో లేవు.

బ్రిటనులో సర్ విలియం బెవరిడ్జి కార్మికుల సాంఘిక జీవిత సౌకర్యాలకు ఒక ప్లాను తయారు చేశాడు. ప్రజలకు సరియైన జీవనోపాధి కలుగచేయాలంటే, ఐదు పిశాచాలను ఎదుర్కోవాలన్నాడు, బెవరిడ్జి అవి. దరిద్రం, ఆనారోగ్యం, అజ్ఞానం, సోమరితనం, అపరిశుభ్రత. బెవరిడ్జి సాంఘిక భీమా సదుపాయాలన్నిటినీ కలిపి ఆచరణలో పెట్టించే సమగ్రమైన స్కీమును తయారుచేశాడు. దీని ప్రకారం కార్మికులు నిరుద్యోగులైనప్పుడు, జబ్బుపడినప్పుడు, వార్ధక్యం సంప్రాప్తించినపుడు, భర్తను కోల్పోయినపుడు, వారి జీవనోపాధికి తగినసహాయంలభిస్తుంది. పెండ్లికి, ప్రసూతికి, దహన క్రియలకు ప్రత్యేక ధన సహాయం వస్తుంది.

కుటుంబ బాధ్యత

సాధారణంగా మనిషి యొక్క జీవితంలో నష్టం కలిగిందంటే, అతని కుటుంబాని కంతకూ నష్టం వాటిల్లుతుంది. జబ్బు, దుర్బలత్వం, పరిశ్రమల్లో వచ్చేజబ్బులు, గాయాలు, నిరుద్యోగం, ముసలితనం, ఇంటియజమాని చనిపోవడం-ఇవి కుటుంబాని కంతకూ నష్టం కలుగజేస్తాయి. అందుచే సాంఘిక భీమా పద్ధతుల ద్వారా వ్యక్తికి, వ్యక్తి యొక్క కుటుంబానికి రక్షణ యివ్వాలి.

ఇండియా ప్రభుత్వంకూడా యిప్పుడు సాంఘిక భీమాపద్ధతిని గురించి ఆలోచిస్తూంది. కార్మికుల జీవిత పరిస్థితుల్నిగూర్చి ఆలోచించడానికి ఒక లేబరు పరిశోధక సంఘాన్ని నియమించింది. ఒక ప్లానింగు కమిటీనికూడా నియమించదలచుకొంది. కాని ప్రజల విశ్వాసాన్ని చూరగొనని ప్రస్తుతప్రభుత్వం ప్రజల పరిస్థితుల నర్థం చేసుకొని, తగిన సౌకర్యాలను సమగ్రంగా కలుగజేయలేదు. జాతీయ ప్రభుత్వం ఏర్పడిననాడే సరియైన సాంఘిక భీమా పద్ధతులు ఆచరణలోకి వస్తాయి. అయినప్పటికీ, ఈలోగా సామాన్యప్రజల సమస్యలేమిటో ఆలోచించుదాము. మొదట సాంఘిక భీమా పద్ధతిని పరిశీలించుదాం.

సాంఘిక భీమాపద్ధతి అవసరం

మనదేశం చాల బీదదేశం కాబట్టి, సాంఘిక భీమాపద్ధతి అమలుజరగదనే వాదన ఒకటి ఉంది. ఇది సరియైనదికాదు. బెవరిడ్జి సాంఘిక భీమానుగురించి చెబుతూ, ప్రజలు ఎంతబీదవారైతే, సాంఘికభీమా అంతఎక్కువ అవసరమని చెప్పాడు. సాంఘిక భీమాపద్ధతి ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని, క్షేమాన్ని కాపాడగలుగుతాము. అప్పుడు సరకుల ఉత్పత్తి ఎక్కువవుతుంది. నేర్పరులగు పనివారలు తయారవుతారు. కాబట్టి మనదేశంలోకూడ బిడ్డలకు ధనసహాయం మొదలుకొని, నిరుద్యోగపు వేతనములు, వృద్ధాప్యపు పెన్షనుల వరకు అన్నిసౌకర్యాలుఅవసరం. ప్రభుత్వం నియమించిన ప్రొఫెసరు అడార్కరు సూచించినమాదిరిగా ప్రధాన పరిశ్రమల్లో మాత్రం కార్మికచట్టాల్లోకొన్ని ముఖ్యమైనసంస్కరణలు తీసుకువద్దామంటే, అవి నిరర్థకమవుతాయి.

మనదేశం పారిశ్రామికంగా అభివృద్ధి అవుతూంది. ఈ అభివృద్ధి నిలబడాలంటే, ఈపరిశ్రమల్లోపనిచేసేకార్మికులకు జీవితసౌకర్యాలు గ్యారంటీచేయబడిననాడే సాధ్యమవుతుంది. ప్రజా ప్రభుత్వం పరిశ్రమలను ప్లానింగుప్రకారం నడిపేటట్లే, సాంఘిక భీమాకుకూడా సమగ్రమైన ప్లానును వెయ్యాలి.

సంస్కరణలు

మనభారతదేశ కార్మికచట్టాల్లో సంస్కరణలు చాల ప్రాథమికదశలో ఉన్నాయి. కార్మికోద్యమం యొక్క ఒత్తిడి మూలంగా కొన్ని కార్మికచట్టాలు అమల్లో పెట్టబడ్డాయి. ఫ్యాక్టరీలలో కార్మికులు పనిచేసే గంటల నిర్ణయము, ట్రేడ్ యూనియన్ చట్టము, జీతాల చట్టము, కార్మిక తగాదాల చట్టము, మాత్రమే ఇప్పుడు అమల్లో ఉన్నాయి. సాంఘిక రక్షణకు సంబంధించినవి పనివారల నష్టపరిహార చట్టము, ప్రసూతి సౌకర్య చట్టము మాత్రమే. ప్రభుత్వం చట్టములు మాత్రంచేసి, వాటిని అమలుజరిపే బాధ్యత యజమానులపై వదలివేసింది. ఈ చట్టములు ఆర్థికంగా కార్మికులకు సహాయపడాలంటే, ప్రభుత్వం ధనసహాయంచేసే బాధ్యత తీసుకోవాలి. కాని, మన ప్రభుత్వం అలా తీసుకోవడం లేదు. వాటిని ఆచరణలో పెట్టించే పద్ధతికూడ లోపభూయిష్టంగా ఉంది.

సి. వి. కె. రావు

కార్మిక నష్టపరిహార చట్టము

పనిలో కార్మికులకు దెబ్బలు తగిలితే యజమాని నష్టపరిహారం యివ్వాలని యీ చట్టంయొక్క ఉద్దేశం. కార్మిక సంఘాలు లేనిచోట్ల యీ చట్టము ఉన్నట్లే కార్మికులకు తెలియదు. దీన్ని వినియోగించుకోడానికి కోర్టులో ఎంతైనా లిటిగేషన్ భరించుకోవలసివస్తుంది. నష్టపరిహారం పొందిన కార్మికుల్ని యజమానులు పనినుంచితొలగిస్తుంటే, వారికి ఎట్టి రక్షణా లేదు. ఇచ్చే నష్టపరిహారం కూడ జీవితం గడపడానికి సరిపోదు. కార్మికునికి పనిలో పెద్దదెబ్బ ఏదైనాతగిలితే వేరొక పనిచేసుకొనే శక్తివంతుడు కాకుండా పోతున్నాడు.

ప్రసూతి సౌకర్యచట్టము

ఇది రాష్ట్ర రాష్ట్రానికి వేరువేరు విధంగా ఉంది. ప్రసవించే కాలంలో ధనసహాయం చేసేబాధ్యతయజమానిది. కాని, ఈవిషయమై ప్రభుత్వం తగిన బాధ్యతతీసుకోక పోవంవల్ల చాల అక్రమాలు జరుగుతున్నాయి. ఇచ్చే ధనసహాయమూ సరిపోదు. యజమానులు ఆ గడువులో స్త్రీలను పనినుంచి తొలగిస్తున్నారు. చాలమంది యజమానులు యీ చట్టాన్ని అమలుపరుచుట లేదనేచెప్పాలి.

ఈ చట్టాలు యింత లోపభూయిష్టంగా ఉండడంవల్ల కార్మికు లెంత బాధపడుతున్నారో వేరే చెప్పనక్కరలేదు. ఈదిగువ విషయాలను గమనించి ప్రభుత్వం కార్మికుల జీవిత సౌకర్యాల రక్షణకై ఒక స్కీము తయారుచేయాలి.

ప్రభుత్వానికి సూచనలు

(1) జీవించడానికి తగిన వేతనముండాలి. (2) నష్టానికి తగు పరిహారం యివ్వాలి. (3) ఆరోగ్యం కాపాడి, ఉత్పత్తికి నష్టం లేకుండా చేయాలి. (4) పరిశ్రమల్లో పనిచేస్తూ, పనులు నిలకడగా ఉన్నవారందరికి యిన్సూరెన్సు పద్ధతిద్వారా సాంఘిక సదుపాయాలు ఏర్పర్చాలి. మిగతావారు యిన్సూరెన్సు లేకుండా సాంఘిక సదుపాయాలు పొందేటట్లుండాలి. ఇందుకై ఒక ఫండును నిలవచెయ్యాలి. దానిలో ఎక్కువ భాగంప్రభుత్వము - యజమానులు భరించాలి.

ఆరోగ్య భీమాపద్ధతి

ఈవిషయమై ప్రభుత్వం తయారుచేసిన నిబంధనలు కార్మికులకు ఉపయోగపడేటట్టులేవు. దేశంలో ఆరోగ్యసౌకర్యాలు చాల తక్కువ. కార్మికుడు అనారోగ్యవంతుడైతే, కొంత నిర్ణీతకాలమునకు ధనసహాయం, మందుల సౌకర్యాలు కలుగచేయాలి. ప్రసూతికి సహాయం, దహనక్రియలకు సహాయం కూడా ఆరోగ్య భీమాలో యిమడ్చాలి.

నిరుద్యోగం

దీన్ని రూపుమాపనిదే, సాంఘిక సదుపాయస్కీములు అర్థం లేకుండా పోతవి. ప్రతి దేశంలో యుద్ధానంతరం ప్రజలకుపూర్తి ఉద్యోగములు కలుగ చేయడానికి ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయి. పని దొరికే వరకు నిరుద్యోగులైనవారికి వేతనములు ఏర్పర్చాలి. కొత్తపనులు నేర్పాలి. దేశంలో నిరుద్యోగులెక్కువైనకొలదీ ఉత్పత్తి కుంటుపడుతుంది. శాంతిరోజుల్లో పనుల అవసరం ఇప్పటికంటె యింకా ఎక్కువౌతుంది కాబట్టి, సక్రమమైన స్కీమువేసి, ప్రజలందరికి ఉద్యోగాలుదొరికేటట్టు, ప్రభుత్వం చూడాలి. నిరుద్యోగ యిన్సూరెన్సు స్కీమును తయారుచేయాలి. దానికి చందాలు యజమానులు, ప్రభుత్వము కార్మికుల దగ్గరనుంచి వసూలు చేయాలి. చందాలు యివ్వలేనివారికి వేరొక స్కీము ద్వారా నిరుద్యోగపు సహాయం అందజేయాలి, మన దేశంలో భిక్షకులెందరో ఉన్నారు. వీరందరికి పనులు నేర్పాలి.

పనిలో దెబ్బలు

ప్రస్తుతమున్న నష్టపరిహార చట్టం కార్మికులకు అంతగా ఉపయోగపడుటలేదు. నష్టపరిహారం సరిపోవుటలేదు. మందులసహాయం లేదు. దెబ్బలవల్ల నష్టపడినవారిని నిరుపయోగులుగా చెయ్యడమవుతూంది. పరిశ్రమల మూలంగా వచ్చే జబ్బులన్నింటికి చట్టంలో నష్టపరిహారం సూచించబడలేదు. పరిశ్రమల్లోకూడ దెబ్బలు తగలకుండా రక్షణ పద్ధతులు అమలుపరచాలి. పరిశ్రమ ననుబట్టి యజమానులదగ్గర సుంకములు వసూలుచేసి, సరియైన నష్టపరిహారం కార్మికులకు లభించేటట్టుచూడాలి.

వార్ధక్యం

మనదేశంలో కార్మికులకు వార్ధక్యం వచ్చినప్పుడు, దుర్బలత్వం పొందినప్పుడు పెన్షనులులేవు. కొద్ది పరిశ్రమల్లో మాత్రమే ప్రావిడెంటు ఫండు, గ్రాట్యూయిటీ అమల్లోఉన్నాయి. ఆరోగ్య సౌకర్యాలు తగినంతగా లేనందునను, జీవనోపాధికి సరిపోని జీతాలమూలంగాను, కార్మికులు త్వరలో గతిస్తున్నారు. వృద్ధాప్యపు పెన్షనుల అవసరంకూడా యెంతో ఉంది. పురుషులకు 60 సంవత్సరములకు, స్త్రీలకు 55 సంవత్సరములకు పెన్షనులు యివ్వాలి. వృద్ధాప్యంలో ప్రావిడెంటు ఫండు మాత్రమే సరిపోదు. పెన్షనులు ఉండితీరాలి.

కుటుంబపోషకుడు చనిపోతే

ప్రస్తుతపరిస్థితుల్లో కుటుంబపెద్ద చనిపోతే అతనిపై ఆధారపడ్డ భార్యాబిడ్డలకు ఆధారం లేకుండాఉంది. జీవించినపుడే సరిపోనిజీతాలుంటే, పోషకుడుచనిపోయిన తర్వాత భార్యాబిడ్డలు బ్రతకడానికి ఆధారమసలేలేదు. బ్రిటనులో పారిశ్రామిక జీవిత భీమాలున్నవి కాని, లాభం కొరకు, వర్తకసరళిని, అవి సాగుతున్నాయి. అవియిన్స్యూరు చేయించుకొన్నవారికి నిరుపయోగంగా ఉన్నాయి. వీట్ల ప్రభావమును తగ్గించి, బీదల డబ్బును కాపాడడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అట్టి భీమాపద్ధతి వల్ల మనకు లాభం లేదు. మనదేశంలో పోషకుడు చనిపోయినతోడనే వితంతువుకు, బిడ్డలకు పెన్షనులు ఏర్పాటు చేసేటట్టు సాంఘిక భీమా పద్ధతిని మార్పుచేయాలి.

జీతాలు - ఉద్యోగము

దేశంలో ప్రస్తుతం ఉన్న కార్మికచట్టాలు చాల తక్కువ. అవైనా సరిగ్గా అమల్లోలేవు. ఉదాహరణకు, ట్రేడ్‌యూనియన్ ఆక్టు ప్రకారం కార్మికులు సంఘాలు పెట్టుకోవచ్చు. కాని ఆ సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి యజమానులు పనినుంచి తొలగిస్తే ఆ కార్మికుల జీవనోపాధి పోవలసిందే: ఏ చట్టము కూడ సహాయపడదు. కార్మికుల తరఫున పని విషయములోగాని, హక్కుల విషయములో గాని, యజమానులతో ఉమ్మడి షరతులు ఏర్పర్చుకోడానికి (Collective bargaining) తగాదాల్లో పరిష్కార విధానం సక్రమంగా జరగడానికి, సరియైనచట్టాలు నిర్మింపబడాలి.

జీవించడానికి కనీస జీతాలు ఏర్పర్చేవిధానాన్నికూడ నిర్మించాలి. ఒకే పరిశ్రమలో రెండుచోట్లజీతాల్లో చాలవ్యత్యాసముంటూంది.

సమగ్రమైన ప్లాను

అన్ని పరిస్థితుల్లోను కార్మికులకు సౌకర్యాలు కలుగజేసే సమగ్రమైన సాంఘిక భీమా పద్ధతి తయారుకావాలి. ఇది కార్మిక సంఘాల సహకారంతోను, ప్రజల జీవిత పరిస్థితుల నర్థము చేసుకొన్ననాడు, సాధ్యమవుతుంది. ఇప్పుడు ప్రభుత్వం చేసే పేపరు స్కీములవల్లగాని, ప్రశ్నావళికి సమాధానాల పద్ధతివల్లగాని, ప్రయోజనంలేదు.

చెన్నరాష్ట్ర చేనేత పారిశ్రామిక వర్కింగుకమిటీవారి విపరీతచర్యలు

పశ్చిమగోదావరిజిల్లా చేనేత పారిశ్రామిక సంఘ కార్యదర్శి శ్రీ గడిమెట్ల గంగరాజుగారు ఈ దిగువ ప్రకటన చేస్తున్నారు.

ఈనెల 8వ తేదీ ఆంధ్రప్రభలో చెన్నరాష్ట్ర చేనేత కార్యనిర్వాహకవర్గ సమావేశం నిడుద్రోలు రైతువిద్యాలయంలో రంగాగారి అధ్వర్యాన జరిగినట్లు ప్రకటించబడినది. దీనిలో సభ్యత్వ అర్హతను గురించిన తీర్మానములో కమ్యూనిస్టులు, రాయిస్టులు వుండుటకు వీలులేదని తెలిపి, యిప్పుడు వున్నవారిని తీసివేయుటకు ఒకకమిటీని ఏర్పరచినారు. ఇట్టి ప్రధాన సమస్యలపై నిర్ణయాలు చేయుటకు ఒక్క మహాసభకే అధికారమున్నది. కాని కార్యవర్గం హద్దుమీరి ప్రవర్తించింది. ఇది గాక, నన్ను మండపేటసభలో కార్యనిర్వాహకవర్గ సభ్యుడుగా ఎన్నుకొన్నారు. కాని నిడుద్రోలులో వర్కింగుకమిటీ సమావేశం జరుగుతుందనే విషయమే తెలియపర్చలేదు. ఇది కేవలం వారి గ్రూపువారిని సమావేశపర్చి నిర్ణయాలు తీసుకొన్నట్లు విదితమగుచున్నది. రాజకీయ విభేదాలను దృష్టియందుంచుకొని సంఘ నియమాలనే అతిక్రమించారు. మిల్లులను ప్రోత్సహిస్తారనే సాకుతో కమ్యూనిస్టులకు, రాయిస్టులకు సంఘ సభ్యత్వ అర్హత లేదని నిషేధించారు. కాని మిల్లు పరిశ్రమలను ప్రోత్సహించేది ఒక్క కమ్యూనిస్టులు మాత్రమేకాదు. కాంగ్రెసువారు కూడ పారిశ్రామికాభివృద్ధికి తగు విధానం నిర్ణయించడానికి జవహర్‌లాల్ నెహ్రూ అధ్వర్యాన ఒక కమిటీని నియమించారనే విషయం జగద్విదితమే. కనుక, యీసాకుతో కమ్యూనిస్టులను వెళ్ళగొడుతున్నారంటే, దీని అంతరార్థం వేరే వుండాలి. రాష్ట్ర కార్యనిర్వాహకులలో కొంతమంది స్వార్థంకూడా కారణం అని చెప్పక తప్పదు.

మా జిల్లాలోని సంఘములలో కమ్యూనిస్టులు, కమ్యూనిస్టులు కానివారు ఐక్యతతో పనిచేస్తూ, మా చేనేత పారిశ్రామికుల దైనందిన కార్యక్రమాన్ని కొనసాగిస్తూయున్నారు. ఈ ఐక్యతవల్లనే మా జిల్లాలో నూలు దొంగమార్కెట్టును పూర్తిగా అరికట్టగలిగాము. నూలు రేషన్ కార్డుల స్కీమును జయప్రదంగా కొనసాగించినాము. సరసమైన మజూరీలు యిచ్చునట్లు పాటుబడ్డాము. నెలకు సప్లయిఅవుతున్న సరుకు సక్రమముగా అన్ని ప్రాంతాలకు చేరునట్లు నూలు పంపకములో పని జేయుచున్నాము. జిల్లాలో 135 సంఘములలో 6000 సభ్యత్వమును చేర్పించినాము. ఇదంతా ఐక్యతా వుద్యమముయొక్క ఫలితం. కాని రంగా గ్రూపువారి తీర్మానము కమ్యూనిస్టులను వెళ్ళగొట్ట వలయునని సూచించుచున్నది.

నేను సుమారు 7, 8 సంవత్సరాల్నుండి చేనేత పారిశ్రామిక సంఘాలలో పని చేయుచున్నాను. కమ్యూనిస్టులు యీ సంఘములలో చేరి పనిచేయుచున్నప్పటినుంచి నిర్మాణయుక్తముగా ఉద్యమాన్ని అభివృద్ధిలోకి తీసుకు రాగలిగాము. ఈ రోజున సాంఘిక, రాజకీయ సమస్యలలో కూడ మా కులాలవారంతా ముందుకు వస్తున్నారు. అనేకకుటుంబాలు కమ్యూనిస్టు కుటుంబాలుగా మారినవి. ఇప్పుడు వీరినందరనీ సంఘాలనుంచి వెళ్ళగొట్టమంటున్నారు రంగాగారు. దీనివలన కలిగే ఫలితం ఏమిటంటే - సంఘాలు ఛిన్నాభిన్నమై చేనేత పారిశ్రామికులకే అనర్థదాయకముగా పరిణమిస్తుంది. కనుక ఏ పరిస్థితులలోను కమ్యూనిస్టులనుగాని, ఏ యితర పార్టీలవారిని కాని వెడలగొట్టుటకు అంగీకరింపజాలము. నేను నా స్వంత అభిప్రాయం మాత్రమే గాకుండా, మా జిల్లా పారిశ్రామికుల అందరి పక్షాన యీ విషయాన్ని తెలియజేయుచున్నాను. ఈ సమస్యపై రంగాగ్రూపువారికి నమ్మకం కలగాలంటే, మా జిల్లాలో బహిరంగసభలు పెడతాము: వారువచ్చి మా ప్రజల ఎదుట మాట్లాడమనండి. ఈ నిర్ణయం ఎంతవరకు పారిశ్రామికులకువుపకరిస్తుందో వారే నిర్ణయించుకుంటారు. ఎక్కడో నిడుద్రోలులో కూర్చొని తీర్మానించి ప్రజలపై రుద్దజాలరు. కనుక కమ్యూనిస్టులను వెళ్ళగొట్టాలనే ధోరణికి స్వస్తిచెప్పి, విచ్ఛిన్న పంథాను విడనాడి, తీర్మానమును ఉపసంహరించుకోవలయునని కోరుచున్నాను."

★

కార్య నిర్వాహకవర్గ సమావేశానికి గడిమెట్ల గంగరాజుగారిని ఆహ్వానించక పోవడాన్ని, కమ్యూనిస్టులను, రాయిస్టులను తొలగించాలనే నిర్ణయాన్ని ఖండిస్తూ పశ్చిమ గోదావరిజిల్లా చేనేత పారిశ్రామిక సంఘ కార్యనిర్వాహకవర్గం యీనెల 13వ తేదీన తీర్మానించింది.

విస్సన్నపేట పోలీసు కానిస్టేబుల్సుకి శిక్షలు

తాలూకా రైతుసంఘ, కమ్యూనిస్టుపార్టీల కృషిఫలితం

విస్సన్నపేట పోలీసులు అమాయక ప్రజలపై అత్యాచారాలు జరిపిన సందర్భంలో, రైతుసంఘం — కమ్యూనిస్టుపార్టీ వెంటనే తగుచర్య తీసుకొని ప్రభుత్వమునకు తెలియపర్చిన ఫలితంగా ప్రభుత్వము వెంటనే విచారణజరిపి, అత్యాచారాలు జరిపిన 245 నెంబరు హెడ్డుకానిస్టేబులు డి. నారాయణరావునీ, 680 నెంబరు కానిస్టేబులు నాగభూషణాన్నీ ఉద్యోగములనుండి డిస్మిస్ చేశారు. 255 నెంబరు కానిస్టేబులు శేషయ్యకు ఇయ్యవలసిన నెల 1కి రు 2-0-0 యింక్రిమెంటునుండి 1 సంవత్సరమువరకు గ్రేడు తగ్గించబడింది.

ఫొటోలు

"ప్రజాశక్తి" లో ప్రకటనార్థం పంపే ఫొటోలు తిరిగి తమకు పంపమని కొందరు వ్రాస్తున్నారు. "ప్రజాశక్తి" కార్యాలయానికి మహాసభలు, ఊరేగింపులు, ఇతర ప్రజావుద్యమాలనుప్రతిబింబించేఫొటోలు, అన్నిటికీ (పత్రికలో ప్రచురింపబడినా, లేకపోయినా కూడా) ఒక ఫొటో ఫైలు వుంచుతున్నాము. అందుచేత ఫొటోలు పంపేవారు ప్రజాశక్తి కోసం ఒకకాపీ ప్రత్యేకంగా పంపాలి. దానిని తిరిగి పంపజాలము.

ఇట్లు,
సంపాదక వర్గం.

ముంపు నివారణలో ప్రభుత్వపు వడ్డీవ్యాపారదృష్టి

కొల్లేరుముంపు నివారణసభలో సూచనలు

ది8—5—45 తేదీన సాయంత్రం 5 గంటలకు కొల్లేరుముంపు నివారణ మహాసభ శ్రీ అనుమర్లపూడి శీతారామారావు గారి అధ్యక్షతను (కృష్ణా జిల్లా రైతుసంఘాధ్యక్షులు) భీమవరంతాలూకా ఆకివీడులోజరిగింది. కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలకు సంబంధించిన 30 కొల్లేరుప్రాంత గ్రామాలనుండి 1500మంది రైతులు ఈసభలో పాల్గొన్నారు. ఊరేగింపు జరిగినపిమ్మట, రైతుగీతాలతో సభ ప్రారంభమయింది. ఈ సభలో పలువురు రైతుకష్టాలనుగూర్చి, కొల్లేరు ముంపునుగూర్చి, దానిని నివారించుకొనుటకు రైతులు ఐకమత్యాన్ని గురించి మాట్లాడారు. అత్యం సత్యవతి, ఆమెభర్త(భూ ప్రదక్షకుడు)మూర్తిగారలు యితర పనిమీద ఆకివీడు వచ్చి, ఉత్సాహపడి సంఘశక్తినిగూర్చి మాట్లాడారు.

అధ్యక్షోపన్యాసం

అధ్యక్షులు అనుమర్లపూడి శీతారామారావుగారు తమ అధ్యక్షోపన్యాసం కొల్లేరు రైతుల యిబ్బందులతో ప్రారంభించారు. బుడమేరు, తమ్మిలేరులగుండా విపరీతంగా నీరువచ్చి కొల్లేరుచేరి, పోయేమార్గంలేక నెలల తరబడి నిలవవుండిపోయి, ఏ విధంగా రైతులను నాశనం చేయుచున్నదో వివరించారు. అష్టకష్టాలుపడి సంవత్సరం పొడుగునా పాటుబడి - నారుపోసి - ఊడ్చి - కలుపుతీసి - కంటికి రెప్పవలె కాచి పంట పండిస్తే, చేతికందే సమయానికి కొల్లేరు ముంపువల్ల రైతు యేవిధంగా కుమిలిపోతున్నాడో వివరించారు. సస్యము ముంపులో నిలువవుండి పోవుటయేగాక వరదపిట్టవలన ఒకరాత్రిలో వందలకొలది యకరముల సస్యము తెల్లవారేటప్పటికి ఒక్కగింజ లేకుండా ఏవిధంగా నష్టమవుతూందో తెలియజేశారు.

అంతేకాకుండా కొల్లేరు గ్రామాలకు రోడ్లు లేవు. రహదారిమార్గము శూన్యం. అందువల్ల ముంపుచివరకు వీధులకుకూడా ఎగతోకడం, ప్రజలుబాహ్యాదులకు పడవలమీద వెళ్ళడం వర్ణనాతీతమైన బాధలెన్నో ప్రజలు పడవలసి వచ్చుచున్నది.

47 సంవత్సరముల క్రితమే కొల్లేరు ముంపును తగ్గించుటకు గవర్నమెంటు తలపెట్టింది. అనేక పర్యాయాలు ఈ స్కీమును గూర్చి సిబ్బందిని వేయడం, తొలగించడం జరుగుతోంది. ఫలితం అనేకవేలు ఖర్చు. 1943వ సంవత్సరంలో ప్రత్యేక సిబ్బందిని వేసింది. కొలతలు, లెక్కలు తయారైనవి. కాని కుంటిసాకులతో మరల సిబ్బందిని ఎత్తివేసింది. దీనికి కారణమేమిటి? ప్రభుత్వం కేవలం వడ్డీవ్యాపార దృష్టితో యీస్కీమును చూడడమే. ఒకప్రక్క ప్రజలు తినడానికి తిండిలేక మలమలమాడి కరువుకాటకాలతో బాధపడుతోంటే, ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతోంది. మరొకప్రక్క అధికోత్పత్తియని ఢిల్లీనుండి బోడిగోడలవరకు ప్రచారమే: ఆచరణ శూన్యం. కారణం ప్రజల సహకారంతో పనిచేయని ప్రభుత్వం ఏమీ చేయలేదు. ప్రజాప్రభుత్వంతోనే అన్నీసాధించగలం. మనం ఐకమత్యంగా ఉంటే, ఈసమస్యను పరిష్కరించడమే కాదు: దేశనాయకులను సహితంవిడిపించుకొని ప్రజాప్రభుత్వంస్థాపించుకోగలం. ఈస్కీము అమలులోనికివస్తే, 60వేలయకరములలో 7లక్షల బస్తాలపంటను ముంపునుండిరక్షించగలం. మరో40 వేలయకరముల భూమి కొత్తగా సాగులోకివచ్చి, 6 లక్షల బస్తాలు అదనంగా పండుతుంది. దేశంలో కరువు కొంత తగ్గుతుంది. యీ స్కీము అమలుపర్చడం పెద్ద కష్టంగాదు. పెదలంక, యలమదుర్రు డ్రెయినులను ఉప్పుటేరులోపడకుండానేరుగా సముద్రంలోనే కలిపి, ఉప్పుటేరును వెడల్పుచేస్తే సగం ముంపు తగ్గుతుంది. బుడమేరు-తమ్మిలేరులకు రిజర్వాయరులు కడితే, ఉన్న ముంపు తగ్గుతుంది. మనమందరం ఐక్యకంఠంతో కోరితే, ఈ సమస్య త్వరలోనే సఫలత పొందుతుంది.

యలమదుర్రు, పెదలంకడ్రెయిన్లు ఉప్పుటేరులో పడకుండా, సముద్రంలోకలపాలనీ; ఉప్పుటేరును వెడల్పు చేయాలనీ; బుడమేరు, తమ్మిలేరులకు రిజర్వాయర్లు కట్టించాలనీ, ప్రభుత్వాన్ని కోరుతూ ఏకగ్రీవంగా మహాసభ తీర్మానించింది.

పార్టీఫండు వసూళ్లు

★

క్రిందటి సంచికలో ప్రకటించిన మొత్తం రు. 29,591-6-0

కృష్ణాజిల్లా

గన్నవరం తాలూకా

శ్రీయుతులు

గుంటక అప్పిరెడ్డి, పెదఓగిరాల 100 0 0
గుంటక పెదఅప్పిరెడ్డి .. 50 0 0
గుంటక స్వామిరెడ్డి .. 10 0 0
పెదఓగిరాలనుండి చిల్లరగా 3 0 0
బండి గోపాలకృష్ణయ్య చినఓగిరాల 200 0 0
కె. వి. పూర్ణయ్యశర్మ .. 150 0 0
ఆక్కినేని కోటయ్య 30 0 0
చినఓగిరాలనుండి చిల్లరగా 11 0 0
కాగిత నారాయణరెడ్డి, తేలప్రోలు 50 0 0
తేలప్రోలునుండి చిల్లరగా 2 0 0
శాస్త్రి రాఘవయ్య, గన్నవరం 50 0 0
పొట్లూరి సీతారాఘవయ్యగారి కుమార్తె వివాహ సందర్భంలో గండిగుంట 10 0 0
కె. హరిశ్చంద్ర రాజుగారిద్వారా 20 0 0

బెజవాడ తాలూకా

వేముల సీతారామయ్య పెదపులిపాక 10 0 0
.. వెంకట నరసయ్య .. 10 0 0
కోలపల్లి రామకృష్ణయ్య .. 10 0 0
.. నరసయ్య .. 10 0 0
.. సీతారామయ్య .. 10 0 0
పెదపులిపాక గ్రామంనుండి చిల్లరగా 8 0 0
అన్నే చలపతిరావు, ఉప్పులూరు 10 0 0
అడుసుమిల్లి కోటేశ్వరరావు .. 10 0 0
పెద్దు వెంకటనారాయణ కాసరనేనివారిలంక 10 0 0
కాసరనేని గోపాలకృష్ణయ్య .. 10 0 0
గరికపాటి పూర్ణచంద్రరావు .. 10 0 0
యలమంచిలి వెంకటేశ్వరరావు, కమల గార్లనుండి: బొడ్డపాడు 50 0 0
తాతినేని నరసింహారావు రాయనపాడు 25 0 0
చిగురుపాటి బుచ్చిరామయ్య-సరస్వతి గార్ల వివాహ సందర్భంలో 35 0 0
కిలారు నరసింహారావు, పెనమలూరు 10 0 0
జి. వి. రంగయ్య గరికపర్రు 10 0 0
తాలూకా కమిటీద్వారా చిల్లరగా 7 0 0

తిరువూరు తాలూకా

వంటూరు వరదయ్య, కొణిజర్ల 25 0 0
మంచు వేంకటేశ్వరరావు .. 20 0 0

బాలసంఘ సభ్యుని "ఉడతాభక్తి"

కామ్రేడ్ సుందరయ్యగార్కి—

మీరు "ప్రజాశక్తి" ని దినపత్రికగా చేయుటకు కావలసిన డబ్బు నిమిత్తము చేసిన ప్రకటనను చూచాను. దాని నిమిత్తమై రు. 1—0—0 నేను పంపించుచున్నాను.

కలగర నాగలింగేశ్వరరావు.
బాలసంఘం, పోతునూరు
12—5—45

కట్టముడి నాగభూషణం .. 10 0 0
సూర్యదేవర నరసయ్య .. 10 0 0
సాదినేని రామయ్య .. 15 0 0
దేవరపు వెంకటేశ్వరరావు, శిరోరత్నమ్మ గార్ల వివాహసందర్భంలో 24 13 6
కొణిజర్ల గ్రామంనుండి చిల్లరగా 41 0 0

బెజవాడ టౌను

కాట్రగడ్డ వెంకటలక్ష్మమ్మ 10 0 0
కాజ వెంకటేశ్వరరావు 20 0 0
కె. సత్యనారాయణరాజు 10 0 0
టి వెంకటేశ్వరరావు 20 0 0
చలసాని ప్రకాశరావు 200 0 0
ప్రజాశక్తి సెల్లు 100 0 0

నందిగామ

మోహన్ 25 0 0
నందిగామనుండి చిల్లరగా 5 0 0
వి. ఏ. ప్రసాద్, బందరు 10 0 0
కేతినేని జగన్నాధరావు, పాలపర్రు 5 0 0

బ్యాండుదళం ద్వారా

గుడివాడ తాలూకా రైతుమహాసభ ఆహ్వానసంఘంవారు, కోడూరు 25 0 0
గుంటూరుజిల్లా రైతుమహాసభ ఆహ్వానసంఘంవారు, తెనాలి 50 0 0
నూజవీడు తాలూకా రైతుమహాసభ ఆహ్వానసంఘంవారు, పోతురెడ్డిపల్లి 25 0 0
ఖమ్మంమెట్టు ఆంధ్రమహాసభవారినుండి 100 0 0
కృష్ణాజిల్లా మహిళామహాసభ, కాటూరు 70 12 3

వైజ్ఞానికదళం ద్వారా

కృష్ణాజిల్లా మహిళామహాసభ ఆహ్వానసంఘంవారు, కాటూరు 50 0 0
చోడవరం గ్రామంనుండి 60 0 0
గుంటూరుజిల్లా రైతుమహాసభ ఆహ్వానసంఘంవారు, తెనాలి 50 0 0
ఉత్తరవిశాఖజిల్లా రైతుమహాసభ వారి నుండి 25 0 0

పశ్చిమగోదావరి జిల్లా

నర్సాపురం తాలూకా 33 6 0

భీమవరం తాలూకా

భీమవరం టౌను 35 0 0
కోరుకొల్లు సెల్లు ద్వారా 50 0 0
దంతులూరి కృష్ణంరాజుగారు 25 0 0

తణుకు తాలూకా

బూరుగపల్లి అచ్యుతరామన్న వేలివెన్ను 250 0 0
గూడపాటిపోతురాజు: అత్తిలి 49 10 0
తణుకు తాలూకా చిల్లరవసూళ్లు 80 0 0

తాడేపల్లిగూడెం తాలూకా

కాకినాడ - బుర్రకథ ద్వారా 50 0 0
తాడేపల్లిగూడెం 50 0 0

చింతలపూడి తాలూకా

శ్రీ కవమతరెడ్డి అంజిరెడ్డి - ప్రగడవరం 15 0 0
శ్రీ ఎర్రోజు శేషాచారి 10 0 0
యర్రగుంటపల్లి 3 0 0

ఏలూరు తాలూకా

గుత్తా మాణిక్యాలరావు చాటపర్రు 40 0 0
కాకరాల పూర్ణచంద్రరావు నాయుడు గూడెం 65 0 0
నూతక్కి సీతయ్యగారు 50 0 0
వేంపాడు - కొక్కిరపాడు (కోత బాపతు) 30 0 0
పెదపాడు చిల్లరగా 17 0 0
మద్దిపాటి వెంకట్రామయ్య దెందులూరు 10 0 0
మొటపర్తి రామదాసు .. 10 0 0
డా॥ ఎస్. నరసింహాచార్యులు .. 20 0 0
బొల్లిన సూర్యనారాయణ .. 15 0 0
దెందులూరు చిల్లరవసూళ్ళు 9 0 0
కొల్లి భాస్కరరావు - పోతునూరు 50 0 0
పర్వతనేని నరసింహారావు .. 10 0 0

ఏలూరు టౌన్

దండుపాటి సోదరులు 116 0 0
చుట్టల వర్కర్సుయూనియన్ద్వారా 54 0 0
మ్యునిసిపల్ వర్కర్సుయూనియన్ 80 0 0
చలసాని బాలకృష్ణ 50 0 0
కడుపు బ్రదర్సు 29 0 0
నేమాల సోదరులు 29 0 0
జూపల్లి రామచంద్రరావు 20 0 0
కూరగాయల వర్తకసంఘం 15 0 0
పడమరవీధి సెల్లుద్వారా 17 0 0
నాగిశెట్టి ఆంజనేయులు 10 0 0
కారిచర్ల ధర్మారావు 10 0 0
మదుపల్లి వీరరాఘవులు 10 0 0
మానెం అచ్చయ్యగారు 10 0 0
బొమ్మన బలరామస్వామి 10 0 0
జోషీగారు తెనాలి వెళ్ళేటప్పుడు పవరుపేట స్టేషన్‌వద్ద 2 1 0
చిల్లరగా 179 4 0

తూర్పు గోదావరిజిల్లా

డాక్టరు యం. వెంకట్రాజు గొల్లప్రోలు 50 0 0
రవణం శ్రీరాములు, కొత్తపల్లి 200 0 0
గొల్లప్రోలు చేనేత పారిశ్రామికులు 80 0 0
కె. రామమోహన్‌రావు, రాజమండ్రి 2 0 0
కె. వెంకట్రావు బి. ఎ. గొల్లప్రోలు 50 0 0
కొప్పుల వెంకట్రావు బి. ఎ. గొల్లప్రోలు 150 0 0
పుత్సల సత్యనారాయణ, ఉప్పాడ 600 0 0
ఒకసానుభూతిపరుడు, రాజమండ్రి 10 0 0
యన్నమని లక్ష్మీపతి, దుళ్ళ 100 0 0
గంధ్రేటి కన్నయ్య, గొల్లప్రోలు 5 0 0
పోచిరాజు సుబ్బరామయ్య, రాజమండ్రి. 10 0 0
దొంతంశెట్టి కోటిలింగం, ఉప్పాడ 100 0 0
కె. సుబ్రహ్మణ్యం బి. యి. గొల్లప్రోలు 50 0 0
పిళ్ళా లోవరాజు, రాజమండ్రి 10 0 0

విశాఖపట్నం జిల్లా

విశాఖపట్నం 4 0 0
మల్కాపురం 55 3 0
విజయనగరం 76 4 0

చిత్తూరు జిల్లా

కాలువ పెద్దిరెడ్డి, పెంచుపాడు 5 0 0
మదనపల్లి కామ్రేడ్సు వరికుప్పలు కొట్టుట ద్వారా 24 4 0
బి. ఎల్. వెంకట్రామయ్యగారి ద్వారా 3 0 0
బి. వెంకట్రమణ 2 8 0
చిల్లరవసూళ్లు 6 2 0

విజయోత్సవాలు

★

యూరప్ యుద్ధంలో ప్రజాపక్షం విజయం సాధించింది. ప్రపంచ ప్రజలందరికీ పండగ చేకూర్చింది. కమ్యూనిస్టుపార్టీ పిలుపు యిచ్చింనే తడవుగా ఆంధ్రలో అనేక ప్రాంతాల్లో విజయోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి.

తెనాలిలో 500 మందితో ఊరేగింపు జరిగింది. గుంటూరుజిల్లా రైతుసంఘ అధ్యక్షులయిన కొల్లా వెంకయ్యగారి అధ్యక్షతను 3 వేల మందితో సభజరిగింది. యూరప్‌లో ఈనాడు ఫాసిజం నశించడమే కాకుండా సామ్రాజ్యవాదంకూడా ఎలా దెబ్బతింటోందో, ప్రజాస్వామ్యం ఎలా బలపడుతూందో వివరిస్తూ కామ్రేడ్ శివయ్య ఉపన్యసించారు. బసవ పున్నయ్యగారు మనరాజకీయాలను గురించి మాట్లాడుతూ, ఐక్య ప్రజాఉద్యమాన్ని నిర్మించుకొని, స్వాతంత్ర్య గమ్యస్థానం చేరవలసిన బాధ్యత మనందరిపై ఉందన్న విషయాన్ని విశదీకరించారు.

ఈ విధంగా అత్యంత ఉత్సాహంతో మన్నూరు, వెంకటగిరి, గూడూరు, అల్లూరు కోవూరు, (నెల్లూరుజిల్లా); గోళ్ళమూడిపాడు, పొందూరు, ఉప్పు గుండూరు, గుంటూరు, (గుంటూరుజిల్లా) బెజవాడ, జొన్నపాడు, ఈడుపుగల్లు (కృష్ణా), ఏలూరు, అప్పారావుపేట, పాలకొల్లు, ఆచంట, (ప. గోదావరి) రాజమండ్రి (తూ గోదావరి) విశాఖపట్టణాలలో విజయోత్సవాలుజరిగాయి.

వరంగల్లు (నైజాం)లో ఆనాడు తోళ్ళ కార్మికుల కాలనీలో 3 వేల మంది ఊరేగింపు విజయోత్సాహాన్ని వెదజల్లుతూ సాగింది. ఊరేగింపు అనంతరం కార్మిక నాయకులు మిత్రరాజ్యాల విజయంయొక్క ప్రాధాన్యతను వివరించారు. మన ప్రజలు కూడా ఐక్యతను, సంఘశక్తిని, పెంపొందించుకొని స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని సాధించాలని ఉద్బోధించారు.

కర్నూలు జిల్లా

వెలుగోడు గ్రామం

సుబ్బారెడ్డి సుదర్శనవర్మలు 100 0 0
లాలం లక్ష్మీ నరసయ్యశెట్టి 10 0 0
లక్ష్మీనరసింహచయనులు (పెండ్లి సందర్భములో) 10 0 0
యమ్. వెంకటరెడ్డి (వివాహ సందర్భంలో) 10 0 0
యస్. రామచంద్రయ్య (ఇంటిలో పండుగ సందర్భంలో) 10 0 0
బి నారాయణమ్మ (నందికొట్కూరు) 5 0 0
ఎ. పుల్లమ్మద్వారా చిల్లరవసూళ్లు 6 0 0
సి. ఎం. పెద్దశేషన్న అండ్ సన్సు 28 0 0

★

దావ సీతమ్మగారు (రాష్ట్ర కమిటీద్వారా) 20 0 0
రామేశ్వరదాసు గుంటూరు (రాష్ట్ర కమిటీద్వారా) 25 0 0

మొత్తం: 35,238 15 9

★ యుద్ధసమీక్ష — తాపీ మోహన్‌రావు

పసిఫిక్కులో మిత్రరాజ్యాల వైఖరి

బర్మా రాజధాని రంగూన్ మిత్రసేనల వశమయింది. బర్మాలో శత్రుశేషం లేకుండా తుడిచిపెట్టే పని ప్రారంభమయింది. చైనాలో ఆగ్నేయ తీరాన్నున్న ప్రముఖ నౌకాశ్రయం ఫూచౌను చైనా సేనలు స్వాధీనం చేసుకున్నాయి. ఓకినావా దీవిలో అమెరికన్ సేనలు శత్రుప్రతిఘటనను క్రమక్రమంగా అణచివేస్తున్నాయి. అమెరికన్ విమానాలు నానాటికి అధిక సంఖ్యాకంగా వెళ్ళి జపాను నడిగడ్డ మీద నిప్పులు చెరిగివస్తున్నాయి. సింగపూర్ ప్రాంతాల్లో బ్రిటిష్ నౌకాబలం విహరిస్తూంది. పసిఫిక్కు రంగంలో ఈనాడు మనకు కనబడుతున్న దృశ్యమిది. అక్షరాజ్య దుష్టగ్రహాల్లో ఇక మిగిలిఉంది ఒక్క జపానే. జపానుపట్టూ ఉరిత్రాడు బిగించడానికి బ్రిటన్, అమెరికా చైనాలు ప్రయత్నిస్తున్నాయి.

బలాబలాలు

జపాను కింకా 40 లక్షల సైన్యం ఉందని నిపుణులైన అమెరికన్ల అంచనా. దీనిలో 20 లక్షలు చైనాలోను, 10 లక్షలు జపానులోను, మిగతాది ఇతర ప్రాంతాల్లోను ఉందట. ఇంతేకాక ఏక్షణంలోనైనా యుద్ధరంగంలోకి రావడానికి తగినవారు ఎన్నో లక్షలున్నారట. ఇదంతా అంచనావేసి, "జపానుయొక్క ప్రధాన మిలిటరీ బలంతో మనమింకా తలపడలేద"ని అమెరికా మిలిటరీ సమీకరణ శాఖాధికారి ప్రకటించాడు. జపాను నౌకా, విమానబలాలు కోలుకోలేని నష్టాల పాలయాయన్న మాట నిజమే. కాని భూరంగంలో దానికింకా ఎంతోబలముంది. పైగా గత పదుసంవత్సరాల నుండి జపానువారు తమ ప్రధాన పరిశ్రమలను మంచూరియాకు మార్చుతున్నారని అమెరికా విదేశ ఆర్థిక వ్యవహార శాఖాధికారి ప్రకటన. ఇక మిత్రరాజ్యాల బలమెంతో చూదాం. ఆకాశ, సముద్రరంగాల్లో పైచేయి మిత్రరాజ్యాలదే. పసిఫిక్కు, బర్మారంగాల్లో ఇంచుమించు 35 లక్షల సైన్యం ఉంది. మరో 9 నెలలకు, వాయిదాలవారీగా ఇంకొక 30 లక్షలసైన్యాన్ని పంపాలని అమెరికావారి ప్లాను. ఇప్పుడు బర్మారంగంలో యుద్ధంచేస్తున్న మిత్రసేనలు మలయా, సయాంలపని పూర్తిచేసుకొనిగాని, ఇతర రంగాలకు వెళ్ళవు. మలయా, సయాం యుద్ధాలుముఖ్యమైనవే అయినప్పటికీ ఫాసిస్టు జపాన్‌మీద అంతిమ విజయాన్ని తేల్చగల యుద్ధాలు చైనా, జపానులలోనే జరగాలి. ఈ రంగాల్లో యుద్ధనిర్వహణ ఎంత గడ్డుపనమో వివరిస్తూ అమెరికా యుద్ధవార్తా ప్రచురణశాఖవారు ఇలా రాశారు: "సైపాన్ దీవిమీద 40,000 సైన్యాన్ని దించేసరికే తల ప్రాణం తోకకివచ్చింది. శత్రురాజ్య తీరం మీద 5 లక్షల సేనను దించి, అక్కడ నిలబడి యుద్ధం చేయడం అంటే ఏమిటో వేరే చెప్పాలా?"

ప్రజాసహకారం ఉండాలి

మిత్రరాజ్యాలకు అపార బలసంపదఉంది. శీఘ్రంగానో, కొంతఆలస్యంగానో, అంతిమ విజయం తప్పదు. కాని, సాధ్యమైనంత తక్కువ రక్తపాతంతో అంతిమ విజయం లభించాలని విశ్వశ్రేయోభిలాషులందరి వాంఛ. బ్రిటన్, అమెరికా, చైనాల వైఖరి ఈ వాంఛను ఈడేర్చగలదా? ఆయా దేశాల ప్రజల సానుభూతిచూరగొని, వారి సహకారంతోను యుద్ధంచేసిననాడే సత్వరవిజయం సాధ్యమని యూరపుయుద్ధం రుజువుచేస్తుంది. బర్మాలో మిత్రసేనలకు ఎంతో తేలికగా ఇంతగొప్ప విజయాలు లభించడానికి అక్కడి గెరిల్లా దళాలు కొంతవరకు కారణమని బ్రిటిష్ అధికారులే ఒప్పుకుంటున్నారు. ప్రజా సహకారంతో విజయం ఎంత సులభసాధ్యమో ఫిలిప్పైన్సు ఘట్టం తెలుపుతూంది. కాని, బ్రిటన్, అమెరికాలు అవలంబిస్తున్న వైఖరేమిటి? బర్మానుతిరిగి ఆక్రమించుకున్నతరువాత అమలు జరపవలసిన రాజ్యాంగ విధానాన్ని గురించి బ్రిటిష్‌ప్రభుత్వం ఒకప్రకటనచేసింది. బ్రిటిష్ పత్రికలు దీనినిగురించి చేసిన వ్యాఖ్యానాలే దీని స్వభావాన్ని స్పష్టంచేయగలవు. "బర్మింగ్హామ్ గెజెట్" ఇలా రాసింది: "బర్మావారికి ఈ యుద్ధానికి పూర్వం ఉండిన హక్కుల్ని కూడా నూతన రాజ్యాంగ విధానం ఊడబెరుకుతూంది" బ్రిటిష్ కమ్యూనిస్టు పత్రిక 'డెయిలీ వర్కర్' ఇలా రాసింది: "బ్రిటన్‌పట్ల ఇప్పటికేఉన్న అపనమ్మకాన్ని ఈ కొత్త రాజ్యాంగ విధానం చాల ప్రమాదకరస్థాయికి తీసుకుపోతుంది."

బ్రిటిష్ ప్రభుత్వపు ఈ వైఖరి ఒక్క బర్మా ప్రజలను మాత్రమే దూరంచేయదు. త్వరలో బ్రిటిష్‌వారు మలయా, సయాంల వైపు పురోగమిస్తారు. ఇలాంటి దృక్పథంతో వస్తున్నవారిని అక్కడి ప్రజలు మిత్రులుగా, స్వాతంత్ర్యప్రదాతలుగా, ఎలాభావించగలరు? ఇది ఇలాఉండగా, ఫ్రెంచి ఇండోచైనాను విముక్తి పరచడానికి మేముకూడా తోడ్పడతామని ఫ్రెంచివారు ముందుకువస్తే బ్రిటిష్—అమెరికన్ సంయుక్త మిలిటరీ అధికారవర్గం వీరు పాల్గొనడానికి వీలులేదని నిషేధించింది. ఫ్రెంచివారికి ధోరణి ఎంతో ఆశ్చర్యం కలిగించింది.

'అంతర్యుద్ధానికి మార్గం'

ప్రధానరంగమైన చైనాలో పరిస్థితులెలా ఉన్నాయో చూదాం. అక్కడ చంగ్-కై-షేక్, అతని కొమింటాంగుముఠా చైనాలో అంతర్యుద్ధం రెచ్చగొట్టడానికి సిద్ధపడుతున్నారని చైనా కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ మావోసేటుంగ్ మొన్న ఏడవకమ్యూనిస్టు మహాసభలో స్పష్టపరచాడు. చైనాలో కొంతభాగం విముక్తిపొందినదే తడవుగా వీరిఘాతుకానికి ఒడిగట్టవచ్చునన్నాడు. చైనాలో మిత్రసేనాధిపతుల్ని గ్రీసులో జనరల్ స్కోబీలాగా ఉపయోగించ జూస్తున్నారన్నాడు. ఈ ఘోరప్రమాదాన్నుంచి చైనాను తప్పించగలది ప్రజాస్వామిక పక్షాలతో కూడుకొని ఉన్న సంయుక్త మంత్రివర్గమేఅని నొక్కి చెప్పాడు. ప్రధానమైన చైనా రంగంలోని పరిస్థితులివి. అటు బ్రిటన్, అమెరికాలు ఆయాదేశ ప్రజలపట్ల అవలంబిస్తున్న వైఖరి అది. దీనివల్ల త్వరలో సాధ్యంకాగల విజయం ఎంతోదూరం పోగలదు. బహుకొద్ది వ్యయప్రయాసలతో తీరిపోయేది, ఎంతో రక్తపాతంతోగాని సాధ్యంకాదు. ఈ వైఖరి పసిఫిక్కు రాజ్యాల ప్రజలకేకాక, ఈ రంగంలోయుద్ధంచేస్తున్న సైనికుల తలిదండ్రులకు, మిత్రరాజ్య ప్రజలకే ఎంతో అనర్ధదాయకం. శాంతి, సౌఖ్యాలతో కూడుకున్న నూతన ప్రపంచ నిర్మాణానికి జరుగుతూన్న ప్రయత్నాలకే దెబ్బ. 22—5—45

యూరప్‌లో

పడమటి జర్మనీలో ఆహారపదార్థాల సరఫరా, జర్మన్ సేనలను రద్దుచేయడం, మొదలయిన వ్యవహార కాండను నడపడానికి డోనిట్జ్ (హిట్లరు తరువాత అధికారంలోకి వచ్చిన నాజీ నాయకుడు) ముఠానే అధికారవర్గంగా గుర్తించాయి బ్రిటన్, అమెరికా ప్రభుత్వాలు. వీళ్ళచేతిలో రేడియో కేంద్రాలనుకూడా ఉంచారు. దీని నవకాశంగా తీసుకొని, వీరు మారుమూలల్లో సోవియట్ వ్యతిరేక ప్రచారానికూడా సాహసిస్తున్నారు. దీనినిగురించి ముఖ్యమైన మూడు సోవియట్ పత్రికలు ఇజ్వెస్టియా, రెడ్‌స్టార్, ప్రావ్దాలు వ్యాఖ్యానించాయి. "డోనిట్జ్ ఉదంతం ప్రమాదకరమైన రాజకీయ సమస్యగా పరిణమిస్తూంది. అన్ని దేశాల్లోను ఆందోళన కలిగిస్తూంది"—అని ఇజ్వెస్టియా.

"జర్మన్ యుద్ధపిపాసులు దెబ్బతిన్నారు. అందుకు ప్రతిక్రియగా వారిప్పుడు యూరప్ వ్యవహారాలను అల్లకల్లోలం చేయజూస్తున్నారన్న విషయం స్పష్టం కావడంలేదా?" అని రెడ్‌స్టార్ హెచ్చరిస్తూంది.

"క్రిమియా నిర్ణయాల ప్రకారం జర్మన్ జనరల్‌స్టాఫ్‌ని (మిలిటరీ అధికారవర్గం — డోనిట్జ్ దీనిలో సభ్యుడు) పూర్తిగా రూపుమాపాలి; నాజీపార్టీని, శాసనాలను, సంస్థలను మచ్చుకయినా లేకుండా తుడిచిపెట్టాలి. యుద్ధనేరస్థులకు వెంటనే తగినశాస్తిచేయాలి" అని ప్రావ్దా రాసింది.

స్టాలిన్ జవాబు

రెడార్మీమీద కుట్రలు సాగించిన పోలిష్ నాయకులను రెడార్మీ అరెస్టుచేసింది. ఈవిషయంపై అలజడినిరేచ్చగొట్టారు, బ్రిటిష్ అమెరికన్ అభివృద్ధి నిరోధకులు. మార్షల్ స్టాలిన్ దీనిని గురించి "లండన్ టైమ్సు" పత్రికా విలేఖరి ప్రశ్నలకు సమాధానం చెబుతూ ఈదిగువ విషయాలను స్పష్టంచేశాడు:

"వీళ్ళ అరెస్టుకి పోలెండు ప్రభుత్వ పునర్నిర్మాణంతో ఎలాంటి సంబంధంలేదు.

"అరెస్టయిన పోలిష్ వ్యక్తులను సంప్రదింపుల సాకుబెట్టి మేము పిలిచామన్నవార్త అబద్ధం. రెడార్మీ రక్షణకు భంగం కలిగించేవారితో, సోవియట్ అధికారులు ఎన్నటికీ సంప్రదింపులు జరపరు.

"ఇక పోలెండు ప్రభుత్వ పునర్నిర్మాణం. అది క్రిమియా నిర్ణయాల ననుసరించే జరగగలదు - వీటికి భిన్నంగా పోవడం అంటూ జరుగజాలదు.

"యుగోస్లావియాలో జాతీయ స్వాతంత్ర్య సంఘాన్ని ఆధారంగా తీసుకొని కొత్త ప్రజాప్రభుత్వాన్నినిర్మించారు. అలాగేపోలెండులో కూడా చేయడానికి అవకాశం ఉంది. ఇలా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సోవియట్‌తో స్నేహసంబంధం కలిగి ఉండాలి. పోలెండు ప్రజలతో సన్నిహితసంబంధంగల పోలెండు నాయకుల ద్వారానే ఈప్రభుత్వ పునర్నిర్మాణ సమస్యను పరిష్కరించాలి." 22—5—45

(4 వ పేజీ తరువాయి) ఆంధ్ర రాజకీయ రంగాన్ని అపవిత్రంచేస్తున్నారో, ఒక పర్యాయం వెనక్కి తిరిగి ఆలోచించుకోవాలి. కాంగ్రెసు పెద్దలకు కమ్యూనిస్టులంటే వుండే ద్వేషంతో ఆలోచనగూడా పోయినట్లుంది. ప్రజలు యీ సత్యాన్ని గ్రహించి, వీరికమ్యూనిస్టు వ్యతిరేక దుష్ప్రచారాన్ని అరికట్టాలి. రంగా, కాశేశ్వరరావు, చంద్రమౌళి ప్రభృతులు రెచ్చగొట్టే యీ కమ్యూనిస్టు వ్యతిరేకదుష్ప్రచారం, ఈఅంతఃకలహాలు దేశక్షేమానికేవినాశకరం. ఆరోగ్యప్రదమైనరాజకీయ, సాంఘిక ప్రజా జీవితానికే ప్రమాదకరం. ప్రజాసేవకే జీవితాలర్పించి, ప్రజలలో లీనమైపోయి, పనిచేస్తున్న కమ్యూనిస్టులను యెవరూ బలహీనపర్చలేరు. కాని, ఆలోచించాల్సిన సమస్య ఇదిగాదు. ఈ దుర్బోధలు, దుష్ప్రచారం, దేశాన్ని, ప్రజల్ని, సంఘాన్ని యెంత బలహీనపరచి వినాశానికి దారితీస్తాయో ఆంధ్రదేశంలోని జాతీయోద్యమాభిమానులందరు తీవ్రంగా ఆలోచించి, ఎదుర్కోవాలి.

(3 వ పేజీ తరువాయి) అనేమాటకు బదులు "స్వపరిపాలన" అనే మాటనే ఉండాలని బ్రిటన్ అంటోంది. ఆ "స్వపరిపాలన" దేశకాల పాత్రల్నిబట్టి వర్తింపజేయాలంటోంది. ఇక అమెరికా ఆశయాన్ని స్టెటినస్ (అమెరికా విదేశాంగ కార్యదర్శి) యిలా స్పష్టీకరించాడు: "ధర్మకర్తృత్వం యొక్క ఆశయం, వెనుకబడియున్న వలసదేశాల ప్రజల్ని ఆర్థికంగాను, రాజకీయంగాను, సాంఘికంగాను అభివృద్ధి పరచడమే. అయితే, ఒక్కొక్క దేశంయొక్కపరిస్థితినిబట్టి స్వపరిపాలన ఏరూపంలో యివ్వవలసి ఉంటుందో ఆరూపంలోయివ్వాలి. అక్కడిప్రజలుసంపూర్ణస్వాతంత్ర్యం కావాలనుకుంటే, అందుకు వారు తగినశక్తిసామర్థ్యాలను కలిగియుంటే, తప్పకుండా సంపూర్ణస్వాతంత్ర్యంఇవ్వవలసిందే."

ఈ "శక్తిసామర్థ్యా"లను నిర్ణయించే అధికారం తమ చేతుల్లోనే ఉంటుందని స్టెటినస్ పరోక్షంగా సూచించాడు. ఫిలిప్పైన్ దీవులకు అమెరికాస్వాతంత్ర్యం ఇచ్చినట్లే ఇతర రాజ్యాలుకూడా పరిస్థితుల్నిబట్టి వలసదేశాలన్నింటికీ స్వాతంత్ర్యం ప్రసాదిస్తాయని పలికాడు. దీనిఅర్థం, వలస దేశాల విషయంలో బ్రిటను, అమెరికాలు రెండూ ఒకటేనని స్పష్టమౌతూంది.

ఇక, చైనా విషయం, ప్రతిదేశానికి "స్వపరిపాలన" హక్కుతోబాటు "సంపూర్ణ స్వాతంత్ర్యం" కూడా ఉండి తీరాలంటుంది చైనా. ఐతే, నెమ్మది నెమ్మదిగా దాన్ని అమలు జరపాలంటుంది. ధర్మకర్తగావున్న రాజ్యం తన విధులన్నీ సక్రమంగా నెరవేర్చకపోతే, యితర రాజ్యాలు చర్యతీసుకునే అవకాశం ఉండాలని వాదిస్తుంది. కాని, చైనా జపానుపై సాగించే యుద్ధంలో అమెరికా మీద యెక్కువగా ఆధారపడుతూండడంవల్ల, తన ప్రతిపాదనలు వోటింగుకు పెట్టించే సాహసం చైనాకు ఉండకపోవచ్చును.

మొత్తంమీద, శాన్‌ఫ్రాన్సిస్కోలో సోవియటు రష్యా వలసదేశాల స్వాతంత్ర్యం కోసం ఏకాకిగా సల్పే పోరాటానికి భారతీయులు అభివందనలర్పించకమానరు. "హిందుస్థాన్ టైమ్సు" (ఢిల్లీ) రాసినట్లు: "సోవియట్ రష్యాకు వలసరాజ్యాల తృష్ణలేనందువనే "స్వాతంత్ర్యం" అనేశబ్దానికి అంత నిక్కచ్చిగా, విశాలహృదయంతో, నిర్వచనం చేయగల్గింది."

ఈ విధంగా, సోవియట్ యూనియన్ శాన్ ఫ్రాన్సిస్కోలో వలసదేశాలపాలిటి కల్పతరువు అవిపించుకొంటూంది.

స్వల్ప వ్యవధిలోనే చెప్పుకోదగ్గ విజయాలు

అమలాపురం తాలూకా ప్రథమ రైతుమహాసభ

అమలాపురంతాలూకా రైతుసంఘం గత 7 నెలలనుండి మాత్రమే నిర్మాణయుక్తంగా పనిచేస్తోంది. కాని యీ స్వల్పకాలంలోనే చెప్పుకోతగ్గవిజయాలు సాధించింది. తాలూకాలోని రైతుల యిబ్బందుల్ని తీసుకుని ఎగ్జిక్యూటివ్ యింజనీరు వద్దకు, చీఫ్ యింజనీరు వద్దకు రాయబారాలు నడిపింది. తక్కావీ అప్పులవిషయంలో విశేషంగా కృషిచేసి చిన్నరైతుల కెంతో తోడ్పడింది. ఇనుపపని ముట్ల విషయంలో పనిచేసి తాలూకాలోని రైతులకు బండిపట్టాలకై 52 హండ్రెడు వెయిట్ల(112 పౌన్లు ఒక హండ్రెడువెయిటు) యినుము నిప్పించింది. వరదలలో లంకరైతులకు వచ్చిన నష్టాలను గురించీ, చెరుకుతోటలకు కిరోసిన్ సప్లయిగూర్చీ విశేష ప్రయత్నాలు చేసింది. ఈ విధంగా పాటుపడుచు 3 నెలల స్వల్పవ్యవధిలో 45 గ్రామాలలో 3000 మంది రైతులను సంఘంలో సమీకరించి, ప్రథమతాలూకా రైతు మహాసభ అమలాపురంలో మే 12 వ తేదీన దిగ్విజయంగా జరిపింది.

జిల్లా కాంగ్రెసునాయకులలో ఒకరైన కీ. శే. శ్రీ నడింపల్లి సుబ్బరాజుగారిపేరిట ఒకగేటు, భారత మహిళల కాదర్శప్రాయంగా స్వాతంత్ర్య సమరంలో పాల్గొని కీర్తి శేషురాలైన శ్రీమతి కమలానెహ్రూ పేరిట రెండవ గేటు ఏర్పరచబడ్డాయి. కాంగ్రెసులీగు, ఎర్ర జెండాలు కొబ్బరిచెట్లపై రెపరెప లాడుతున్నాయి. వేదికవెనుక భారతదేశపటం, దానిపై సుత్తీ కొడవలి చిత్రం. మహాసభ స్థలం ఉత్తేజాన్ని, ఉద్వేగాన్ని కలిగిస్తోంది.

12 వ తేదీ ఉదయం 8 గంటలకు 300 మంది వలంటీర్లతో కనులపండువ గొలుపుతూ ఊరేగింపు బయలుదేరింది. ముచ్చటైన ఒక విమానంపై రైతునాయకు లాసీను లయారు. పట్టణ వీధులగుండా యీ వూరేగింపు సాగుతోవుంటే, ప్రజలలో సంచలనం కలిగింది. 11 గంటలకు ఊరేగింపు ముగిసింది.

మధ్యాహ్నం 1 గంటకు విషయనిర్ణయ సభ జరిగింది. గత ఏప్రిల్ 21 వ తేదీన తాలూకా అంతటినుండి 60 మంది ప్రతినిధులు అమలాపురంలో సమావేశమై గావించిన చిత్తు తీర్మానాలకు సవరణలు, స్థానిక సమస్యలపై క్రొత్త తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

ముఖ్యమైన తీర్మానాలివి :

తీర్మానాలు

చీమూరు, అష్టి, కులశేఖరపట్నం, కేసుల్లో నిందితుల ఉరిశిక్షను రద్దుచేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ; కాంగ్రెసు నాయకులను విడుదలచేయాలనీ; సోవియట్ ప్రజలకు, ఎర్రసేనకు అభినందనాలు తెలుపుతూ; పోటీ రైతుసంఘాలు పెట్టుట రైతుఉద్యమానికి ద్రోహమనీ; ఐక్యరైతు వుద్యమ నిర్మాణానికి దేశభక్తుల నాహ్వానిస్తూ, ధాన్యంధర గాదెదగ్గర రు. 11 లు వుండాలనీ;వ్యవసాయాదాయాలపై పన్ను సమ్మతమే ననీ కొన్నిసూచనలిస్తూ; పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి త్వరగా పూనుకోవాలని; రెండో పంటకు పనికివచ్చే భూములను పరిశీలన చేసి రొటేషన్ జోన్‌లో చేర్చాలనీ; "ప్రజాశక్తి"ని దినపత్రికగా నడుపుటకు ప్రభుత్వం అనుమతి యివ్వాలనీ - యింకా మరికొన్ని తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి.

సాయంత్రం జరిగిన పశు ప్రదర్శనంలో శ్రీ యాళ్ల దశరథరావు గారికి మొదటి బహుమతి, నల్లా కృష్ణమూర్తి గారికి రెండవ బహుమతివచ్చేయి. ఈ బహుమతులు శ్రీ కుంచనపల్లి సూరమ్మగారు తనభర్త జ్ఞాపకార్థము యివ్వ నిశ్చయించారు.

పతాకోత్సవం

తిరిగి 5 గంటలకు మహాసభ ప్రారంభమైంది. 3000 మంది ప్రజలు హాజరయారు. జాతీయగీతాలు పాడిన తదుపరి తూర్పుగోదావరి జిల్లా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చింతం సత్యనారాయణదాసు రైతు జెండా నెగురవేస్తూ యిలా ఉపన్యసించేరు: "1937 లో కోటిపల్లిలో జరిగిన జిల్లారైతు మహాసభలో ప్రొఫెసర్ రంగా అధ్వర్యమున వాదోపవాదాలు జరిగి చివరికి జెండా రైతుల వర్గ చిహ్నంగా గుర్తించబడింది. ఈ జెండా క్రింద వేలాది దేశభక్తులు స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో త్యాగాలుచేశారు. ఆనాడు ఎర్రజెండా కావాలన్న రంగా ఈరోజున దాన్ని వ్యతికిరేస్తూ రైతుఉద్యమాన్ని చీలుస్తున్నాడు. మనజిల్లాకాంగ్రెసు నాయకులలో ఒకరైన శ్రీ మల్లిపూడి పళ్ళంరాజుగారు సైతం, రైతుసంఘాలపై దుష్ప్రచారం చేస్తూ పోటీ రైతుసంఘ నిర్మాణానికి పూనుకొన్నట్లు తెలుస్తోంది. ఇటువంటి విచ్ఛిన్నక చర్యలను రైతాంగం తమ సంఘబలంతో ఎదుర్కొని ఎర్రజెండా ప్రతిష్టను, గౌరవాన్ని కాపాడాలి"

తదుపరి ఆహ్వానసంఘ కార్యదర్శి మహాసభకు కామ్రేడ్ మృణాళకాంతిబోస్, సి. వి. కె. రావు, బాలాజీదాస్, కోడుగంటి గోవిందరావు, కాట్రగడ్డ నారాయణరావు, మాజీ మంత్రి, పి. సుబ్బరాయన్‌గార్లు పంపిన సందేశాలు చదివేరు.

మహాసభను ప్రారంభిస్తూ కామ్రేడ్ వావిలాలగోపాలకృష్ణయ్యయిలాఉపన్యసించేరు:

"మాది పల్నాటిసీమ, మీది కోనసీమ. రాళ్ళు రప్పలు, వేడిగాడ్పులు, జొన్నన్నం, అంబలి, దుఃఖాలతో కూడుకొన్న నరకం మాది. చల్లగాలి, వరి అన్నం, కొబ్బరినీళ్ళు, సౌఖ్యాలతో కూడుకొన్న జీవితం మీది. కాని నిజానికి చూస్తే మనమంతా యీ రోజున బ్రిటిష్ సామ్రాజ్యవాదుల క్రింద పారతంత్ర్య నరకమను భవిస్తున్నాం." దేశంలో కరువు కాటకాలనుగూర్చి చెబుతూ, బెంగాలులో ఏ విధంగా దొంగవ్యాపారస్తులు స్త్రీల మానాన్ని అమ్మికూడా లాభాలు తీస్తున్నారో చెప్పారు. ఉత్తర విశాఖ ప్రజల దుస్థితిని వివరించివారికి తక్షణం సాయపడాలని ఉద్బోధించేరు. జాతీయాంతర్జాతీయ రాజకీయాలను సమీక్షచేసి, మిత్రమండలి విజయం ప్రజా విజయమని నిరూపించేరు. జాతీయెక్యతద్వారా జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకుంటేనే స్వతంత్ర ప్రపంచంలో స్వతంత్ర భారతదేశం తగు స్థానం ఆక్రమిస్తుందని నుడివేరు.

తదుపరి అధ్యక్షులు కామ్రేడ్ యినుగంటి నారాయణరావు మాట్లాడుతూ, జిల్లాలోని రైతువుద్యమాన్ని సమీక్షచేసి స్వల్పవ్యవధిలోనే జిల్లాలో తగు స్థానమాక్రమించిన తాలూకా రైతుసంఘాన్ని అభినందించేరు. రైతుసంఘాలు కాంగ్రెసుకు వ్యతిరేకమనే నినాదంతో ఉద్యమాన్ని చీల్చుచున్న విచ్ఛిన్నకుల ఆటలను కట్టించాలంటే, తమ కష్టముల నీదేర్చుకోవాలంటే, రైతులంతా తమ వర్గసంస్థలో చేరి పనిచేయాలన్నారు. లంచగొండి తనాన్ని రూపుమాపుట, తమ హక్కులను సాధించుట రైతులసంఘటిత శక్తిద్వారానే సాధ్యపడుతుందని చెప్పేరు.

రాత్రి గం 9 లకు వైజ్ఞానిక ప్రదర్శనాలు జరిగాయి. కామ్రేడ్ వావిలాల తిరిగి మాట్లాడుతూ బుర్రకథలు, సమిష్టిగానం, నాటకాలు మొదలైన కళారూపాలద్వారా ప్రజల్లో స్వాతంత్ర్య జ్యోతిని రగుల్కొల్పాలని చెప్పారు. రామచంద్రపురం దళం చెప్పిన "కష్టజీవి" బుర్రకథ ప్రజల నురూర్రితలూగించింది.

జయజయ ధ్వానాలతో మహాసభ దిగ్విజయంగా ముగిసింది. — మా విలేఖరి

జోహారులు

కామ్రేడ్ కోనా వీరయ్య (కంచకచర్ల, కృష్ణా) 1943 సెప్టెంబరులో పార్టీలోకి వచ్చాడు. వయస్సు 20 సంవత్సరములు. పేద కుటుంబీకుడు. 5 గురు సోదరులు. తల్లి తండ్రి మొత్తం కుటుంబమంతా రెక్కలకష్టం మీద జీవించేవారు. ఒక బట్టలషాపులో గుమాస్తాగా వుంటూ యీ కామ్రేడ్ స్థానిక షాపుఎంప్లాయీస్ యూనియన్‌లో కోశాధికారిగా పనిచేసేవాడు. కిరోసిన్‌పంకములోను, కలరా, మశూచి మొదలగు అంటువ్యాధుల నిర్మూలనలోను, రాయలసీమ కరువుఫండు వసూలు చేయుటలోను, దొంగమార్కెటును, అరికట్టుటలోను(కంచకచర్లనుండి గుంటూరు జిల్లాకు పోయేజొన్నలు, కందులు మొదలైన ఎగుమతులు)శక్తివంచనలేకుండా పనిజేశాడు. 2 మాసముల నుండి మలేరియాతోబాధ పడుతూ, ది 23 మార్చి 1945 లో కమ్యూనిష్టుపార్టీ ఆఫీసులో పార్టీసభ్యుల యెదుట అసువులను గోల్పోయాడు.

యీ కామ్రేడ్ ఏ ఆశయము కొరకు పనిచేస్తూ తన ప్రాణాలను వీడాడో ఆ ఆశయముకై మేము పనిజేస్తామని ప్రతినజేస్తూ, మాతోబాటు ప్రజాసేవలో పనిచేసిన ఒక కామ్రేడ్‌ను కోల్పోయినందుకు విచారం తెల్పుతూ, ఈతని కుటుంబమునకు మా సానుభూతి నందజేయుచున్నాము.

తిండిదొంగలకు ★ ★ లంచగొండుల చేదోడు!

తిరువూరు తాలూకా, గంపలగూడెం సెంటరులో (కృష్ణా) ప్రభుత్వం బియ్యంసప్లయికి ఇద్దరు చిల్లర వర్తకులకూ, ఒకటోకు వర్తకునికీ, లైసెన్సులిచ్చి అమ్మిస్తోంది.కాని వీరు దొంగతనంగా నైజాంలో విపరీత లాభాలకు బియ్యం అమ్ముతున్నారు. తమవద్ద ఎంతస్టాకు ఉన్నదీ, ఎంత అమ్మినదీ, బోర్డులు కట్టరు. ఒక్క గంపలగూడెం గ్రామానికి నెలకు 65 టన్నుల బియ్యం వస్తోంది. కాని, అందులో యెక్కువ భాగం నైజాం పోతూంది. స్థానికోద్యోగులు లైసెన్సుదారుల వద్ద లంచాలకు మరిగి, తగు చర్య తీసుకోకుండా ఉన్నారు.

4-5-45 వ తేదీని సాయంకాలం 4 గంటలకు శ్రీకాకుళం వెంకటప్పయ్య అనే లైసెన్సు వర్తకుడు, డిపోనుండి 17½ శేర్ల బియ్యం రెండుమూటలుగా కట్టించి, ఎదురుగా వున్న కొత్తగుండ్ల రాఘవులుగారి యింట్లో వేయిస్తూంటే.కమ్యూనిస్టువాలంటీర్లుచూచారు. ఆమూటలు తీసుకు వచ్చిన చిర్రా పాపయ్యను పట్టుకున్నారు. గ్రామ కరణాన్ని, మధ్యవర్తులను తీసుకువచ్చి ఎంక్వైరీచేస్తే, రాఘవులుగారు బియ్యం తనవి కాదన్నారు. కాని, రాఘవులుగారివేనని శ్రీకాకుళం వెంకటప్పయ్యగారి గుమాస్తా చెప్పాడు! కంట్రోలు ఆర్డరుకు వ్యతిరేకంగా వెంకటప్పయ్యగారు దొంగవ్యాపారం చేస్తున్నట్లు దీనితో స్పష్టమైంది. వెంటనే కమ్యూనిస్టులు అతనిపైకేసుపెట్టారు.

8—5—45 న యిలాంటిదే మరొక ఘటన జరిగింది. దుందిరాలపాడు గ్రామానికి చెందిన కావూరు వెంకటరామ లక్ష్మీనరసింహం అనే వర్తకుడు గంపలగూడెం వచ్చి, ధనలక్ష్మి రైస్ అండ్ గ్రౌండ్‌నట్ మిల్లునుండి (లైసెన్సు డిపో) రాత్రిపూట ఒక బస్తా బియ్యం పెర్మిట్ లేకుండా మూటలుకట్టి బండిమీద తోలించుటకు వెళ్తూంటే, ప్రజారక్షణదళంవారు చూచారు. వెంటనే గ్రామకరణాన్ని పిలుచుకువచ్చి చూపించారు. ఫ్యాక్టరీవారు, యివి వర్కింగుకు వచ్చిన ధాన్యం బాపతు బియ్యం అన్నారు. బిల్లు చూపించమని అడిగితే, తెల్లకాగితంమీద వర్కింగుబిల్లురాసి చూపించారు. దానికి ఒరిజినల్ లేదు! నిజంగా వర్కింగు బియ్యమే అయితే, పరుపులుగా తయారుచేసి వాటిమీద చొప్ప, వరిగడ్డి ఎందుకో! కాని, కరణంగారు కూడా అవి వర్కింగ్ బియ్యమే నన్నారు! అచ్చుబిల్లు ఉండనవసరం లేదన్నారు. అందువల్ల కేసు పెట్టడాని కొప్పుకోలేదు! ఆ కరణంగారి పేరు అయ్యదేవర జగన్నాధంగారు!

వెంటనే ప్రభుత్వం విచారణ సల్పి, పై తిండిదొంగల్ని - వారికి అండగావున్న లంచగొండి గ్రామోద్యోగుల్ని శిక్షించవలసిందిగా కోరుతున్నాను.

— ఎస్. కృష్ణమూర్తి

'పూర్వౌన్నత్యాన్ని తిరిగి పొందాలి'

పెరుగుగూడెం సభలో ఓరుగంటి రెడ్లఉత్సాహం

— చల్లపల్లినారాయణరావు

ఆంధ్రదేశంలో చాలా ప్రాంతాలలో ముత్రాచులనే కులంవారిని మనం చూస్తూ ఉంటాం. వీరిలో అక్కడక్కడ కొద్దిమంది భూములుగల రైతులున్నా, ఎక్కువమంది కష్టపడి కూరలుపండించి అమ్ముకొని జీవిస్తూ ఉంటారు. స్త్రీలు, పురుషులు సరిసమానంగానే సాయపడతారు. వీరిలో ప్రత్యేకమైన వీరోచిత లక్షణాలు కనబడుతూ ఉంటాయి. కాని ఏమిలాభం? త్రాగుడు, జూదం వీరి దిన చర్యలలో ఒకభాగమైపోయింది. ఎంత సంపాదించినా, దరిద్రదేవత వీరియింట యిలవేల్పయింది. వీరిలో చదువు శూన్యం. రైతులుగా ఉన్నవారుగూడ అతి త్వరగా కూలీలు అయిపోతున్నారు. పై దురలవాట్లూ, అజ్ఞానమే వీరిని అనేక వక్రమార్గాలకు పట్టించాయి.

ప్రపంచము ముందుకు పోతూవుంటే, వీరిలో కొద్దిమంది చదువుకున్నవారు తమ సంగతి యేమిటని ఆలోచించారు. తాము పూర్వపు రెడ్లలో ఓరుగంటి రెడ్డిశాఖకు చెందినవారమని ఆధారాలు సంపాదించారు. భోగిరెడ్డి వెంకట సుబ్బారెడ్డిగారు, భోగిరెడ్డి కోటిరెడ్డిగారు (బాపట్లతాలూకా, మర్రిపూడి), వేటు వీరస్వామిరెడ్డిగారు (బాపట్ల) మొదలైనవారు 22-10-39 తేదీన "మద్రాసు ఆంధ్ర ఓరుగంటి రెడ్డిసంఘాన్ని స్థాపించి, 27-10-41 తేదీన రిజిష్టరు చేయించారు. ఈ సంఘ కార్యకలాపం చెంగల్పట్టు, నెల్లూరు, గుంటూరు జిల్లాలలో 120 గ్రామాలకు వ్యాపించింది.

కృష్ణాలో

కృష్ణాజిల్లాలో ఆంధ్ర ఓరుగంటి రెడ్డి సంఘం 26—10—44 తేదీన శ్రీ నాయుడు ఉయ్యూరురెడ్డిగారు, పెరుమాళ్ళ మాచయ రెడ్డిగార్ల కృషివల్ల స్థాపించబడింది. ఉయ్యూరు రెడ్డిగారు ఎంతో ఓపికతో కైకలూరు, బందరు, దివి, గన్నవరం, బెజవాడ తాలూకాలలో విరివిగా ప్రచారంచేశారు. వీరి ప్రచారం పశ్చిమ గోదావరిజిల్లాకు కూడ వ్యాపించింది. గ్రామగ్రామాన ఓరుగంటిరెడ్డి సంఘాలను ఏర్పరిచారు. స్వల్పకాలంలోనే అపూర్వమైన ఫలితాలు ఈ సంఘంవల్ల కల్గినవి. అందరూ రెడ్డిబిరుదుతో పిలుచుకుంటున్నారు. సంఘంలో చేరినవారందరు త్రాగుడు, జూదము, కోడిపందాలు, ఇతర దురలవాట్లూ మానేసి యితరులకు ఆదర్శప్రాయులవుతున్నారు. కొన్ని గ్రామాలలో తమపిల్లలకు చదువులు నేర్పించుటయేగాక, పెద్దలుకూడ చదువు నేర్చుకుంటున్నారు. వీరిలో కలిగిన ఈ నూతన చైతన్యాన్ని మిగతాప్రజలందరూ హర్షిస్తున్నారు.

4—5—45 తేదీన కైకలూరు తాలూకా పెరుగుగూడెంలో జరిగిన ఓరుగంటి రెడ్డి మహాసభకు నేను, కొందరుమిత్రులం వెళ్లాం. ఒక పెద్ద రైతుమహాసభకు చేయవలసిన ఏర్పాట్లుచేశారు. పేరుకు కైకలూరుతాలూకా మహాసభేఅయినా, జిల్లాలోని అన్నితాలూకాల నుండి ప్రతినిధులు, ప్రేక్షకులు మొత్తం 1500 మంది వచ్చారు. మహాసభ మధ్యాహ్నం 2 గంటలకు శ్రీ పెరుమాళ్ల మాచయ రెడ్డిగారి అధ్యక్షతను ప్రారంభమయింది. భోగిరెడ్డి సుబ్బారెడ్డిగారు, భోగిరెడ్డి కోటి రెడ్డిగారు వేదిక సలంకరించారు.

మేలుకోవాలి!

మంగళాపురం ఓరుగంటి రెడ్డి యువకులు ఈదిగువ పాటపాడి సభికులను త్తేజపరిచారు.

ఓరుగంటి రెడ్డివీరు లేకమవ్వాలీ
రెడ్డిబిరుదు గౌరవమును నిల్పుకోవాలీ
ప్రజలకు తెలుపుకోవాలీ
సంఘ దురాచారములను రూపుమాపాలీ
ఆత్మ గౌరవాభిమానాన్ని ల్పుకోవాలీ
నిల్పుకోవాలీ ప్రజలకు తెల్పుకోవాలి
రెడ్డిసంఘ మిత్రులతో చేయి కల్పాలీ
రెడ్డిసంఘ శత్రువులతో పోరుసల్పాలీ
పోరుసల్పాలీ వీరుల పేరు నిల్పాలీ

కృష్ణా జిల్లాలో ఓరుగంటి రెడ్డిఉద్యమ నిర్మాత, నాయుడు ఉయ్యూరురెడ్డిగారు తమనివేదికను చదివారు. సుబ్బారెడ్డిగారు, కోటిరెడ్డి గారు ఉపన్యసించారు. తాము రెడ్లలో ఒక శాఖయైన ఓరుగంటి రెడ్లమనీ, ఓరుగంటి సామ్రాజ్య కాలంలో ఎంతో ఔన్నత్యము ననుభవించి, తర్వాత నానాటికి హీనస్థితిలో పడిపోవలసి వచ్చిందనీ, ఇందుకు చారిత్రకాధారాలు ఉన్నవనీ, తరములుగడచినకొలదీ పేదరికము, చెడులవాట్లూ బలపడి తమ జాతియే రూపుమాని పోతూందనీ, చెప్పారు. వెనుకబడిన అనేక కులములవారు విద్యావంతులై ముందుకు పోతూవుంటే, నిపురు గప్పిన నిప్పు అనదగు ఓరుగంటి రెడ్లు ఇంకా వెనుబడిఉన్నందుకు ఆవేదన తెలియజేశారు. ఓరుగంటిరెడ్డి అత్యుత్తమపురుషుడు. ఆయనలోగల ఉత్తమలక్షణాలను వికసింపజేయాలి. ఓరుగంటి రెడ్డిసంఘంలో చేరే ప్రతిఒక్కరు రెడ్డి బిరుదును దాల్చి, అట్టి ఉత్తమలక్షణములను అలవరచుకోవాలన్నారు. ఈఉద్యమం యొక్క ఆశయం "మనలను పతితులుగా చేస్తూన్న త్రాగుడు దురాచారాన్ని మానివేసి సత్ప్రవర్తన పెంపొందించుకుంటే, దాని బలంతో అన్నిదురాచారాలను పోగొట్టుకోగలం. పెద్దలు ఈనిర్ణయం తీసికొని పిల్లలకు విధిగాచెప్పించాలి. అప్పుడు మనం ఓరుగంటిరెడ్లుగా చెప్పుకొనుటకు అర్హులమౌతాము" అని ఉద్బోధించారు.

వచ్చినవారిలో తమ నాయకులిచ్చిన సందేశాన్ని గ్రామగ్రామమునకు తీసికొనివెళ్ళి, తమలో ఓరుగంటి రెడ్డియొక్క ఉత్తమ లక్షణాలను బలపరచుకోవాలనీ, అందుకు తమ దురాచారాలను పోగొట్టుకోవాలనే దృఢ సంకల్పం కలిగింది. ఉత్తమ లక్షణాలుగల ఓరుగంటిరెడ్డిని ఆదర్శంగా పెట్టుకొని, ఆ స్థాయికి పోవడంకోసం ప్రారంభించిన వీరిఉద్యమం సర్వజనాదరణీయమని గుర్తించాను. రైతు, కూలీ ప్రజాఉద్యమాలూ, కమ్యూనిస్టుపార్టీ ఓరుగంటి రెడ్డిఉద్యమానికి అన్నివిధాల తోడ్పడతాయని చెప్పి, వాటితరపున అభివందనాలుతెలియజేశాను.

రాగి శాసనం

అక్కడ ఒక భట్రాజుగారివద్ద ఒక రాగి శాసనం లభించింది. దానిమీద "పార్థివనామ సంవత్సర వైశాఖ బహుళ దశమి గురువార" మని యున్నది. ఈ శాసనము 120 సంవత్సరములకు పూర్వపు దయి ఉంటుంది. దేవరకోటసీమకు ముచ్చు రామిరెడ్డి తగువు తీర్చిన సందర్భములో చిట్రాజు రామరాజు గారికి ఓరుగంటి పట్టాభిరెడ్లు ఈధర్మశాసనం చెక్కించి యిచ్చినారు. పెదనసీమ, మంగినపూడి, నందమూరు, కాకర్లమూడి, నాయుడు వారిపాలెం, మేదూరుసీమ, పెదఓగిరాల, కవిశేశ్వరపురపాలెం, కృష్ణాపురంపాలెం, కూదేటిపాలెం, పెదసనగంటి పాలెం, కలిదిండిసీమ, పెరుగుగూడెం, చిగురుకోట, గంజాలవారిపాలెం, కొరగుంటపాలెం - వీటి తరపున 36 గురు రెడ్లపేర్లతో ఈ శాసనం యివ్వబడింది. అందరికీ రెడ్డి బిరుదు ఉంది. వారి యింటిపేర్లు కోమటి, గంజాల, పేరుబోయిన, పరసా, పేరం, నాయుడు, పిట్టు, ముచ్చు, పాము, పోటుబోయిన, కొంచే, పెరుమాళ్ళ, పిండి, తుమ్మా, వాకాని, దేశి, అని ఉన్నాయి. ఈశాసనాన్ని పెదనవాస్తవ్యుడు కిరపుల్లు సుబ్బారావు చెక్కినట్లున్నది. ఈశాసనాన్ని చదివి వినిపించాను. అక్కడి వారిలో, తాము రెడ్డికులశాఖవారమేనా అని యెవరికైనా అనుమానం ఉంటే దీనితో అది తీరిపోయింది. సభకు వచ్చిన వారందరిలో ఉత్సాహం వెల్లివిరిసింది.

మంచి భవిష్యత్తు

ఒకప్పుడు జగద్విఖ్యాతి గాంచిన భారత దేశం నేడు ఎలా హీనస్థితిలో ఉందో, అలాగే పూర్వం విజ్ఞాన సంపన్నముగను శౌర్యోపేతంగనూ వినుతికెక్కిన అనేక జాతులు మరుగున పడిపోయాయి. భారత జాతీయోద్యమంతో వెనుకబడియున్న అన్ని జాతులు మేల్కొంటున్నాయి, ఓరుగంటి రెడ్డిఉద్యమంకూడ అట్టిదే. ఈ ఉద్యమానికి మంచి భవిష్యత్తు ఉండడానికి సందేహం లేదు. వారిలోగల దురాచారములు, మూఢ విశ్వాసాలు పటాపంచలై, ఆత్మగౌరవం అభివృద్ధి అయినకొద్దీ వారు ఆంధ్రోద్యమములోను, భారత స్వాతంత్ర్యోద్యమము లోను ఉచితస్థాన మలంకరించగలరు.

రెండు సంవత్సరాలక్రితం మంగళాపురం ఓరుగంటి రెడ్ల భూములను చల్లపల్లి జమీందారు అక్రమంగా లాగుకొన్నప్పుడు, వారు వీరోచితంగా ప్రతిఘటించడం, 50 మంది పురుషులు, స్త్రీలు జైళ్ళకు వెళ్ళడం జరిగింది. నాటినుండి మంగళాపురం ఓరుగంటి రెడ్లు జమీందారుకి ప్రక్కలో బల్లెంలా ఉన్నారు. అందుచే వారికక్ష పట్టలేక, గ్రామంలో జమీందారీ ముఠాకుచెందిన కొంతమంది స్వార్థపరులు దుర్మార్గులు గ్రామ ఓరుగంటి రెడ్డి సంఘ నాయకులలో ఒకరైన పేరం రామకోటి రెడ్డిని ఒంటరిగా చూచి ప్రమాదకరమైన దెబ్బలు కొట్టడం జరిగింది. ఆ ఘటనను గూర్చి ఈ దిగువతీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడినది:

"దివి తాలూకా మంగళాపురం గ్రామంలో ఓరుగంటి రెడ్డిసంఘం బలపడటం ఓర్వలేక, చల్లపల్లి జమీందారుముఠా మన సంఘాన్ని నాశనం చేయాలనే దురుద్దేశ్యముతో రెడ్డి సంఘ ప్రెసిడెంటుగారైన పేరం రామకోటి రెడ్డిగారిని ప్రమాదకరముగా కొట్టి, దౌర్జన్యం చేసినందులకు జమీందారీముఠా యొక్క ఆక్రమచర్యను ఈ మహాసభవారు తీవ్రముగా నిరసించుచున్నారు."

కైకలూరు తాలూకా ఓరుగంటి రెడ్డి సంఘానికి కార్యనిర్వాహక వర్గాన్నెన్నుకున్నారు. అధ్యక్షులు పెరుమాళ్ల లక్ష్మారెడ్డి; ఉపాధ్యక్షులు నాయుడు ఉయ్యూరురెడ్డి; కార్యదర్శి పేరం నరసింహారెడ్డి; కోశాధికారి పేరం కృష్ణారెడ్డి; మరితొమ్మిది మందిసభ్యులు.

సభాస్వాతంత్ర్యాన్ని అరికట్టజూచే కాంగ్రెసు పెద్దలు

రాష్ట్ర నిమ్నజాతుల అభివృద్ధిని ఆపలేరు

ఆంధ్రరాష్ట్ర నిమ్న జాతుల ఫెడరేషన్ కార్యదర్శి, నక్కా చినవెంకయ్య గారు, యిలా రాస్తున్నారు :

ఈనాడు మా పదికోట్ల ప్రజలు బలమైన సంఘంగా యేర్పడి, స్వతంత్రభారతదేశంలో సగౌరవమైన ఆర్థిక, సాంఘిక, రాజకీయ హక్కులు కావాలని ఐక్యకంఠంతో ఎలుగెత్తి చాటుచున్నారు. ఆంధ్ర దేశంలో నిమ్న జాతుల ప్రజాసామాన్యం మా జండాక్రింద నిలవడి మా కోర్కెలను బలపరచుచున్నారు.

కాని, జాతీయవాదుల మని చెప్పుకొనే కొందరు కాంగ్రెసు పెద్దలు మాకోర్కెలకు, మా ఆశయాలకు, పెడార్థములు తీసి, అభివృద్ధికరమైన మా ప్రజాసంస్థను అడిపోస్తున్నారు. కొద్దిరోజులలో జరుగనున్న ఆంధ్ర రాష్ట్ర నిమ్న జాతుల ప్రధాన సమావేశాన్ని గూర్చి కొవ్వలిగ్రామంలో (ఏలూరు తాలూకా) ప్రచారం చేసుకొంటూంటే, సవర్ణులైన కాంగ్రెసుపెద్దలు సభాస్వాతంత్ర్యమును అరికట్టజూచుట శోచనీయం. ఈ సంకుచితవాదుల విచ్ఛిన్నచర్యలను ఖండిస్తూ కొవ్వలి, దోసపాడు, పోతునూరు, పాలగూడెం, అలుగులగూడెం గ్రామాలలో ప్రచారం చేశాం. ఏలూరు నిమ్న జాతుల సంఘంవారు, గ్రామవ్యవసాయ కూలీలు, 13-5-45 న బ్రహ్మాండమైన ఊరేగింపుగా కొవ్వలినుండి ఏలూరువెళ్ళి, తమ న్యాయమైన కోర్కెలు తెలియజేస్తూ వీధివీధులలో చాటి చెప్పారు.

నిమ్న జాతుల ప్రాథమిక కోర్కెలకు అడ్డంవచ్చే వ్యక్తులనుగాని, సంస్థలనుగాని, అభివృద్ధిని కోరే వారెవరూ హర్షింపజాలరు. ఇట్టివారి బెదరింపులు మహాసభను ఆపలేవు. రాష్ట్రంలో నిమ్న జాతుల అభివృద్ధిని ఆపలేవు. మారాష్ట్రమహాసభకు స్వజాతీయులు, అభిమానులు, అభిమానసంస్థలు విరివిగా విరాళాలిచ్చి ప్రోత్సహించవలసిందని కోరుచున్నాము.

Editor : M. Chandrasekhara Rao, Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

Regd. No M. 4486 0-2-0



జయదుందుభి

అదుగో.
అదుగదుగో జయదుందుభి !
నోరులేక, కూడులేక
చావలేక, చావలేక
చచ్చిన సైన్యానికి
'ధణధణ' మని శిపమెత్తించీ,
రణరంగానికి బలి యిప్పించిన
అదిగో,
అదుగదుగో జయదుందుభి !

ఇది మీదేశం
ఇది మీరాజ్యం
రణరంగానికి నడవండంటూ,
దేశభక్తి పొఱ కండ్లకు గట్టి,
దేశచరిత్రకు మానికవేసి,
నత్తువ పిండీ
నెత్తురు త్రాగే
నరహంతలకూ
నరపీనులకూ
ప్రతిధ్వనించే
కృతాంత గర్జన
అదుగో....

ఒక సైనికునికి
మతమవి చెప్పి,
మరి యింకొకనికి
జాతి సుమాయని,
మత్తెక్కించీ
కత్తులుదూసీ
హత్యలు చేస్తే
అవతలి తమ్ముల
ఆక్రందనలను
ఆహ్లాదించే
హంతకపాలన
అంతం చెందే
ఆశానమయం
ఆసన్నం అని
ఘోషిస్తున్నది
వీరనినాదం....అదుగో !

ప్రజాస్వామ్యమని
ప్రజాస్వత్వమని -
మాటలు పలికే
కోటల దాటులు -
అమాయకంగా
అల్పరాజ్యముల
హక్కులుమ్రింగే
రక్కసి గొంతుక -
వినరాదింక
వినరాదంటూ వినిపిస్తుందొక
విప్లవ దుందుభి.... అదుగో !

ఆకాశంలో
అరుణారుణమై
అమరజ్యోతి
ఆశాకిరణం....
విజయపతాక
రక్తపతాక....
శ్రామిక జీవుల
జగత్తుగోనం,
కళ్యాణాంచిత విశ్వంకోసం,
బలియై, చిందిన
రక్త పతాక !
అన్నల్లారా!
అక్కల్లారా !
ఐక్యకంఠమున
'నియంతృపాలన
నిర్మూలం' - అని నడవండంటూ
ప్రతిధ్వనించే విముక్తకంఠం
అదుగో........

యుగయుగాల తరబడిగా
బంధించిన
ఇనుప సంకెళ్ళు
టప్. టప్. టప్‌మని
బ్రద్దలుకొట్టి
జారుప్రభుత్వపు
చీకటి కొట్టుల
ఇనుపతలుపులను
పొడిపొడి చేసి,
ధనికవర్గ
యంత్రమ్ముల పొగలకు
నెత్తురుపూసిన
ఎర్రసైనికుల
పదఘట్టనలను
ప్రతిధ్వనించే
జయదుందుభి !....
అదుగో........

— శ్రీ పోలూరి ఆంజనేయప్రసాద్.
ఎం. ఏ.

తుది పరీక్ష

★

బాంబుల ఉరుములు
టేంకుల ఉరుకులు
తోపుల ఊపులు
తోటా మోతలు
ఓరష్యా ! నీ
రక్తపరీక్షకె
శక్తి పరీక్షకే.

నాజీ పులులను
నాశం చేసిన
నీజయ యుద్ధం
మానవజీవిత
మహా యుద్ధముల
అంతు తెలిపెనోయ్.

బర్లిన్‌పై నీ
అరుణపతాకం
స్వార్థబలానికి
స్వాతంత్ర్య శక్తికి
తేడా తెలిపెను.

నష్టమునొందిన
నీ సౌభాగ్యం
నవ ప్రపంచపు
శాంతి సంపదకు
పూడిక తీసెను
పునాది వేసెను.

నీ యోధులనెత్తుటి
ఎర్రని కాంతులు
ప్రపంచమంతటా
క్రమ్మక తప్పదు.

రగిలి పడిన నీ
రక్తధారలూ
ఇంకిపోక తూ
ఫాను లేపెను.

ఒక్క పెట్టునా
కాలం మారెను
నీ జారినరక్తం
సార్థకమయ్యెను.

నీ ఉద్రేకంతో
ఉద్వేగంలో
ఉప్పొంగులలో
హంతకులంతా
అంత మొందిరి.

మృత్యుబలానికి
తుది శిక్ష ఇదే.
నీజయ శక్తికి
తుది పరీక్ష ఇదే.

— శ్రీ దాశరధి కృష్ణమాచార్య

బెర్లిన్ పతనం

గడచిన
గడియయుగంగా
క్రమ్మిన చీకటి
తెరగా - సాగిన నరబలి
పరిపాలన విరిగింది !

బెర్లిన్ —
పాడెపోయిన నీ
యేడంతస్తుల మేడలు
శ్మశానాల వికవికలై
నరజాతికి పకపకలై
చరిత్రను కళంకితం
చేసిన
నాజీ బెర్లిన్ -
స్వార్థానికి దాసినవై
నరులకు
పైశాచిక నాగరికత
నేర్పాలని
విరులకు
భరింపలేని
దుర్గంధం కావాలని
నీ చేసిన నిఖిల
కృషీ
నీ పన్నిన పన్నాగం
విఫలమైనై.
నరజాతికి
వరంలాగ వచ్చిన
నీ పతనం
ప్రజాశక్తి తెచ్చిన
ఈ విజయం
మానవ జగ
దంధకార
తుది బంధ మోక్షణం.

నిరాశలో
నీ నియంతకు
జాతి గర్వరుజామతికి
మరణం పరమౌషధమై
జగద్వ్యర్థక
రాజ్యానికి
జర్మనీ కేంద్రంగా
జాతిజాతి ప్రజాకోటికి
హిట్లర్ ప్రతినిధిగా
కోరిన సామ్రాజ్య
దురాశకు
గోరీకట్టిన పతాక
అదుగో !
రీచ్‌స్టాగ్ భవనంపై
యెగురుతోంది
యెర్రపతాకం ! !
జాతిగర్వ నాశనకర
జయపతాక !
సామానతా ప్రతిపాదక
సామ్యవాద పతాక !
నీ కదలిక
జర్మన్ ప్రజలకు
స్వేచ్ఛావాయు ప్రసాదిగా
స్వతంత్ర జర్మన్
జాతి చరిత్రకు వ్రాసిన
ప్రథమాధ్యాయంగా
ఎగురు ! ఎగురు !
[illegible]

నీలి నీడలో
ఎగురు !

నాజీనాయక పరిపాలనలో
నరహత్యలు
చేర్చుకొన్న జాతికి—
స్వోత్కర్షా వ్యామో
హవలయులో
గిలగిల తన్ను
కున్న జాతికి —
విముక్తి —
సమానతా స్వాతంత్ర్యం
పునాదులై కట్టిన
నవజగత్తు నిర్మాణంలో
వర్గరహిత సంఘ
స్వర్గంలో - విముక్త
జర్మన్‌జాతి సుఖిస్తుంది.

నెత్తురుటేరులు పారవి
మెత్తని బాటల లోకంలో
ఇంకో హిట్లర్ పెరగని
ఇంకో యుద్ధం జరగని
లోకంలో - విముక్త
జర్మన్‌జాతి సుఖిస్తుంది.

ప్రతి జర్మన్ పౌరుని
హృదయంలో ప్రసరించే
కాంతులు -
నవబెర్లిన్ నగరంపై
ఎగిరే యెర్రని కాంతులు
గత శృంఖల విచ్ఛేదక
అభ్యుదయపు
అరుణోదయమే !

[illegible]

సోవియట్ రైతు

●

ఒక తరం క్రిందట—

నిత్య దరిద్రంతో, అజ్ఞానంతో, కృశించి, కృంగిపోయాడు, జారుకాలంనాటి రైతు—

ఒక తరం తర్వాత—

తన వ్యవసాయం తానే సాగిస్తున్నాడు: తన భూమిని తానే ఏలుతున్నాడు. విద్య, విజ్ఞానం, సంపద, సంతృప్తితో మునిగి తేలుతున్నాడు.

ప్రపంచప్రజలకు మిరుట్లుగొల్పే రెడార్మీ విజయాలకు, మాతృదేశ సంరక్షణకు వెన్నుపూసగా నిలచాడు. నాజీరాక్షసులకు సింహస్వప్నం. ప్రపంచ పీడిత ప్రజలకు మార్గదర్శి, ఆశాజ్యోతి సోవియట్ రైతు.

అట్టి రైతును గురించి సులభంగా, సూక్ష్మంగా తెలుసుకోవాలంటే,

చదవండి 'సోవియట్ రైతు'

వెల 0—4—0

ప్రజాశక్తి కార్యాలయం,
బెజవాడ.

END OF ISSUE